ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 139, పేజీలు - 08

శనివారం, నవంబర్ 21, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

అభివృద్ధికి జనాభాతో పాటు జీడీపీ ప్రాతిపదిక కావాలి

– లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం కీలక వ్యాఖ్యలు

- 'సదరన్ రైజింగ్ సమ్మిట్-2026'లో సీఎం రేవంత్ రెడ్డి - జనాభా ఆధారంగా సీట్ల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- రాష్ట్రాల ఆర్థిక ప్రగతికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి - తెలంగాణ రైజింగ్ 2047తో రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్ - విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడారంగానికి పెద్దపీట

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో జనాభాతో పాటు రాష్ట్రాల ఆర్థిక ప్రగతిని కూడా ప్రాతిపదికగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేవలం జనాభా ఆధారంగా 50 శాతం సీట్ల పెంపు చేపడితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల సీట్ల ఆధిపత్యంతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితులు తలెత్తవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రాల జనాభాతో పాటు జీడీపీ, ఆర్థిక అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని సూచించారు.

పేదవాడి అభ్యున్నతే అసలైన అభివృద్ధి!

దేశాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన విధానాలు, గత నేతల దార్శనికతను సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ప్రతి పేదవాడి అభ్యున్నతిలోనే నిజమైన అభివృద్ధి ఉందని మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ

2లో..



ఎవరి ఆకలి తీరడం లేదో

దేశానికి తెలుసు

– మోదీ వ్యాఖ్యలకు రాహుల్ స్ట్రాంగ్ కౌంటర్!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పారిశ్రామికవేత్తలకు పన్ను రాయితీలు కల్పించినప్పటికీ వారి ఆకలి తీరడం లేదంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. అసలు ఎవరి ఆకలి తీరడం లేదో దేశ ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. ప్రధాని చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల్లోని వైఫల్యాలను బయటపెట్టాయని విమర్శించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శతాబ్ది సదస్సులో

2లో..

రేవంత్ రెడ్డి వన్‌టైమ్ వండర్ వీడర్

– తెలంగాణ కా బాద్షా కేసీఆర్ మాత్రమే!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న 'సదరన్ రైజింగ్ సమ్మిట్--2026' వేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరుపై వ్యంగ్యాస్త్రాలు సంధించిన కేటీఆర్, ఢిల్లీకి ట్రిప్పులు వేయడంలో, ఢిల్లీ పెద్దలకు బ్యాగులు మోయడంలో, తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రికి 10కి 10 మార్కులు ఇవ్వవచ్చని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కానీ, ఎల్‌నినో ప్రభావంపై కానీ ముఖ్యమంత్రికి ఏమాత్రం దిగులు లేదని, ప్రస్తుతం ఆయనకున్న ఒకే ఒక్క దిగులు 'నేను గడ్డం ఎందుకు పెంచుకున్నాను'

2లో..



రేవంత్ రెడ్డికి రాజగోపాల్ రెడ్డి కౌంటర్

– తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్రమవుతోన్న ఇంటిపోరు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సిద్ధిపేట సభలో కాంగ్రెస్ పార్టీలోని అసమ్మతి నేతలను ఉద్దేశించి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు.

2లో..

ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీ

- ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు ఐపీఓకు సీఎం గ్రీన్‌సిగ్నల్ - వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓ లక్ష్యంగా కార్యాచరణ
- రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణకు ప్రత్యేక కార్పొరేషన్ - రాష్ట్రంలో 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలు.. 209 క్లస్టర్లుగా విభజన

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకుంటూ మైనింగ్ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) తరహాలో ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ)ని దేశంలోనే అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలు, మైనింగ్ రంగంలో పెట్టుబడుల ఆకర్షణ తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని ఖనిజ వనరుల



విలువను పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, మన వనరులను మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేయాలని అధికారులకు సూచించారు. ఖనిజ సంపదను కేవలం ఆదాయ వనరుగా కాకుండా భవిష్యత్ ఆస్తిగా మార్చడమే లక్ష్యం కావాలని చంద్రబాబు పేర్కొన్నారు.

వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఏపీఎండీసీ ఐపీఓ

ఏపీఎండీసీని మరింత బలోపేతం చేసే దిశగా వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేలా ఐపీఓ కార్యాచరణ రూపొందించేందుకు

2లో..

ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం


– 28 స్థానాల్లో ఏకంగా 27 కైవసం!

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ స్థానిక సంస్థల రాజకీయాల్లో అధికార ఎన్డీయే కూటమి తిరుగులేని విజయాన్ని సాధించింది. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28 జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు నిర్వహించిన పరోక్ష ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకపక్ష విజయాన్ని నమోదు చేసుకున్నారు. మొత్తం 28 జడ్పీ పీఠాల్లో కేవలం ఒకే ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లా మినహా.. మిగిలిన 27 జిల్లాలను ఎన్డీయే తన అకౌంట్‌లో వేసుకుంది.

పార్టీల వారీగా బలాబలాలు

రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా

2లో..



తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది

– వచ్చే ఎన్నికల్లో మా విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

- రేవంత్ సీఎం అయ్యాకే బీజేపీ 8 ఎంపీలు గెలిచిందన్న కిషన్‌రెడ్డి
- ఇటీవల రెండు ఎమ్మెల్సీల్లోనూ బీజేపీ విజయం సాధించిందని వెల్లడి
- రాబోయే రెండు ఎమ్మెల్సీలపైనా కేంద్ర మంత్రి ధీమా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సీఎం ఏ రేవంత్ రెడ్డిపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సిద్ధిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన కిషన్ రెడ్డి తెలంగాణ రాజకీయాల్లో ఇకపై బీజేపీ అసలైన ఆట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు రాజకీయ మార్పును బలంగా కోరుకుంటున్నారని, దానిని నిజం చేసే సత్తా ఒక్క తమ పార్టీకి మాత్రమే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమ కోసం బీజేపీ కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నిలువునా దోపిడి చేశాయని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ "రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాతే తెలంగాణలో బీజేపీ ఏకంగా 8 ఎంపీ సీట్లను దక్కించుకుంది.

2లో..

సిద్ధిపేటలో నాపై పోటీ చేయ్..

తేల్చుకుందాం

– సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సవాల్!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. సిద్ధిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, 2029 ఎన్నికల్లో తెలంగాణతోపాటు అక్కడ కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధిపేట సభ సాక్షిగా చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. దమ్ముంటే సిద్ధిపేటలో తనపై పోటీ చేయాలని అక్కడే ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. సిద్ధిపేట సభలో రేవంత్ ప్రసంగం

2లో..



కేసీఆర్ నా కథలో రావణాసురుడు

– కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా లీడర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై, ఆయన కుమారుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తన కథలో 'రావణాసురుడు'గా అభివర్ణించిన రేవంత్, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడంటూ కొట్టిపారేశారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని, కేటీఆర్‌ను తాను అంత సీరియస్‌గా పరిగణించడం లేదని రేవంత్ స్పష్టం చేశారు. "కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడు. తండ్రి అండతోనే ఆయన లీడర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు కేసీఆర్ కాబట్టి, ఆయన్నే నేను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తాను" అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేసిన

2లో..

ఉగ్రవాదులకు ప్లాన్లు ఇస్తున్న ఏఐ

– అమెరికా పరిశోధనలో షాకింగ్ నిజాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మనం రోజూ ఎన్నో పనులకు ఉపయోగించే కృత్రిమ మేధ (ఏఐ) చాట్‌బాట్‌లు, ఇప్పుడు ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించి ఇచ్చేంత ప్రమాదకరంగా మారాయి. ఈ భయంకరమైన వాస్తవాన్ని అమెరికా ప్రభుత్వ జవాబుదారీ కార్యాలయం (జీఏవో) జరిపిన ఒక పరిశోధన వెలుగులోకి తెచ్చింది. ఈ పరిణామంపై అమెరికా నిఘా వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. న్యూహ్యాంప్‌షైర్ సెనేటర్ మేగీ హసన్ అభ్యర్థన మేరకు ఈ ఏడాది మే నెలలో జీఏవో అధికారులు.. చాట్‌జీపీటీ, క్లాడ్, జెమినాయ్, గ్రోక్ వంటి ప్రముఖ ఏఐ చాట్‌బాట్‌లను పరీక్షించారు. ఉగ్రదాడికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరగా, మొదట అవి నిరాకరించాయి. అయితే,



పరిశోధకులు తెలివైన ప్రశ్నలతో వాటి భద్రతా వలయాలను ఛేదించి సమాచారాన్ని రాబట్టగలిగారు. ఈ పరీక్షల్లో ఒక చాట్‌బాట్.. పార్కింగ్ ప్రాంతంలో ఎక్కడ కారు బాంబు పెడితే ఎక్కువ నష్టం జరుగుతుందో, ఎక్కువ మంది చనిపోతారో వివరిస్తూ

2లో..

ఎవరి ఆకలి తీరడం లేదో దేశానికి తెలుసు

పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. పారిశ్రామికవేత్తలపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఆరోపణలు కావని, అవి ఆయన సొంత వైఫల్యాలను అంగీకరించడమేనని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తల ఆకలి ఎప్పటికీ తీరదని మోదీ వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావిస్తూ.. అసలు ఎవరి ఆకలి తీరడం లేదో దేశ ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు.దేశంలోని విమానాశ్రయాలు, ఓడరేవులు, గనులు, అడవులు, విద్యుత్తు, బొగ్గు, రహదారులు వంటి కీలక రంగాలన్నీ కొద్దిమంది చేతుల్లో పెట్టారని రాహుల్ ఆరోపించారు. ఇన్ని రంగాలపై ఆధిపత్యం సాధించిన వారు దేశంలో ఎన్ని ఉద్యోగాలను సృష్టించారని ప్రశ్నించారు. మరోవైపు, అత్యధిక మందికి ఉపాధి కల్పించే చిన్న వ్యాపారులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పెద్ద నోట్ల రద్దు, లోపభూయిష్ట జీఎస్టీ విధానాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయని విమర్శించారు. గుత్తాధిపత్యం వల్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడవని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మార్కెట్‌లో పోటీ తగ్గిపోవడంతో పాటు వస్తువుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు, ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత ప్రధాని విధానాలను ప్రశంసించే పరిస్థితుల్లో లేరని విమర్శించారు.

అభివృద్ధికి జనాభాతో పాటు జీడీపీ ప్రాతిపదిక కావాలి

విశ్వసించారని గుర్తుచేశారు. నెహ్రూ హయాంలో విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అనేక విద్యాసంస్థలు, నీటిపారుదల ప్రాజెక్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, సరళీకృత ఆర్థిక విధానాలను ప్రస్తావిస్తూ వాటిని మన్మోహన్ సింగ్ మరింత ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి నమూనా అని స్పష్టం చేశారు.

తెలంగాణ పెట్టుబడులకు గ్లోబల్ ఆహ్వానం

తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను రూపొందించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమన్నారు. గడిచిన మూడేళ్లలో 65 శాతం కార్యక్రమాలను అమలు చేశామని, మిగిలిన లక్ష్యాలను వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలు కల్పిస్తున్నామని, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణ వైపు రావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి ఇంటర్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా విద్యారంగంలో పలు సంస్కరణలు చేపడుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమాల వల్ల పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని వివరించారు. పదో తరగతి పూర్తయిన తర్వాత ఇంటర్మీడియట్ కళాశాలలు దూరంగా ఉండటంతో కొంతమంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇంటర్మీడియట్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

మెస్సీని తీసుకొచ్చాం.. రొనాల్డోను ఆహ్వానిస్తాం

విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. పాతకాలపు కోర్సులకు స్వస్తి పలుకుతూ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రపంచస్థాయి విద్యను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని, ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయబోతున్నాయని వెల్లడించారు.క్రీడారంగ అభివృద్ధితో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహిస్తున్నామని, ఇందులో సుమారు 8 వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లయన్ మెస్సీని తెలంగాణకు తీసుకువచ్చామని, పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. మెస్సీ తన అభిమాన క్రీడాకారుడని, గతంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం మారడోనా కూడా తన అభిమాన ఆటగాడని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

రేవంత్ రెడ్డి వన్ టైమ్ వండర్ లీడర్

అన్నదేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించిన కేటీఆర్ ముఖ్యమంత్రి పదే పదే 'తెలంగాణ రైజింగ్' అని చెబుతున్నారని, అసలు తెలంగాణ దేనిలో రైజింగ్ అవుతోంది, క్రైమ్‌లోనా అని సూటిగా ప్రశ్నించారు. గత మూడేళ్లలో రేవంత్ రెడ్డి రాష్ట్రంలో చేసిన ఒక్క అభివృద్ధి పనిని అయినా చెప్పగలరా అని సవాల్ విసిరిన ఆయన, రాష్ట్రంలో ఎవరి వద్దకైనా వెళ్లి రేవంత్ రెడ్డి పేరు చెబితే తిట్లు మాత్రమే వినిపిస్తాయని అన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలైన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిలే ముఖ్యమంత్రి అక్రమాలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తుచేశారు.అవినీతి ఆరోపణలు చేస్తూ దేశంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' కాదు, 'రేవంత్ రెడ్డి బ్యాంక్ ఆఫ్ ఇండియా' ఉందని అనాల్సిన పరిస్థితి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి బిల్డర్ దగ్గర ముఖ్యమంత్రి 10 శాతం వాటా తీసుకుంటున్నారని, అందుకే దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ నుంచే నిధులు వెళ్తున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీకి 'ఏటీఎం'గా మారిన రేవంత్ రెడ్డి, ఢిల్లీకి సంచులు పంపుతున్నారని, ఆ ఏటీఎం 2028 డిసెంబర్‌లో ఎక్స్‌పైర్ అవుతుందని పేర్కొన్నారు. రామ్‌లీలా మైదానంలో రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా ర్యాలీ చేస్తుంటే, ఇక్కడ పది మంది ఎమ్మెల్యేలను దొంగతనం చేసిన అసలైన 'ఓట్ చోర్' రేవంత్ రెడ్డి అని, ఆయన ఓట్లను కూడా దొంగతనం చేయగలరని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మా ముఖ్యమంత్రి అయినప్పటికీ, అంతకుమించి ఆయన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు బాడీగార్డుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ఇదే సమయంలో బీజేపీ నేతలపైనా కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిల్డర్ల నుంచి వసూళ్ల వ్యవహారం అంతా తెలిసి కూడా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రేవంత్ రెడ్డిని పట్టుకోరని, వారిద్దరి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీజేపీ మాత్రమే కలుపుకుంటూ వస్తోందని అన్నారు. ఇక రాష్ట్ర బీజేపీ నేతలు వాళ్ల హైకమాండ్‌కు గులాంగిరీ చేస్తారని, బండి సంజయ్ అమిత్ షా చెప్పులు మోస్తారని, రామచందర్ రావు అమిత్ షా కాళ్లు మొక్కుతారని, ఇదేం పద్ధతో తనకు ఎప్పటికీ అర్థం కాలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్థాయిని ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డికి తాము చాలని, కేసీఆర్ అవసరం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిది కేసీఆర్ స్థాయి కాదని, కేసీఆర్ స్థాయి వేరు, ఆయన స్థానం వేరని, ఒక కొడుకుగా కాకుండా ఒక సామాన్యుడిగా చెబుతున్నానని, కేసీఆర్ ఒక 'లివింగ్ లెజెండ్' అని కొనియాడారు. రేవంత్ రెడ్డి కేవలం 'వన్ టైమ్ వండర్ లీడర్' మాత్రమేనని, మూడేళ్లలో ఏం చేశారో చెప్పకుండా కేసులు పెడుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో ఖచ్చితంగా బీఆర్ఎస్ పార్టీయే తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్ "అమిత్ షా హో.. కోయి ఔర్ షా హో.. తెలంగాణ కా బాద్షా హై కేసీఆర్" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

రేవంత్ రెడ్డికి రాజగోపాల్ రెడ్డి కౌంటర్

ఉన్నత పదవుల్లో ఉన్న నేతలు హుందాగా మాట్లాడాలని రాజగోపాల్ రెడ్డి హితవు పలికారు. అధికారం ఉందన్న అహంకారంతో ఇష్టం వచ్చినట్లు వ్యవరిహరిస్తే జనం హర్షించరని గ్రహించాలన్నారు. అదృష్టం కొద్దీ లభించిన అధికారంతో అవినీతికి పాల్పడే, ప్రజల అవసరాలను విస్మరించి దుర్మార్గపు పాలన సాగించే పాలకులను తెలంగాణ ప్రజానీకం, చరిత్ర ఎన్నటికీ క్షమిందనే విషయాన్ని మరవొద్దని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను అమలు చేసేలా ధర్మంగా, నిజాయితీగా పాలన సాగించేలా ముఖ్య నేతలకు సద్బుద్ధి, ఆత్మ పరిశీలనా జ్ఞానాన్ని ప్రసాదించాలని ఆ అయ్యప్ప స్వామిని వేడుకుంటున్నానంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే తన పోస్టులో ఎవరి పేరును ప్రస్తావించకపోయినప్పటికీ ముఖ్య నేతలకు అని ప్రస్తావించడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారనే భావన వ్యక్తం అవుతోంది.అంతకు ముందు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓ సభలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'నువ్వే ముఖ్యమంత్రి. నీ భాషేంటి?' అని ప్రశ్నించిన కోమటిరెడ్డి, కొడంగల్‌కు వేల కోట్లు నిధులు పట్టుకుపోతానని సీఎం అంటున్నారని మరి మునుగోడుకు నిధులు అడగొద్దా అని ప్రశ్నించారు. మూడేళ్ల పాలన పట్ల ఎవరూ సంతోషంగా లేరన్నారు. ఈ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చినట్లుగా సిద్ధిపేట సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. నిన్న మొన్న మా వాళ్లు ఒకరిద్దరికి ఏమైందో, ఎర్రి కుక్క కరిసిందేమో చెడును మైకులో చెబుతున్నారన్న సీఎం, మంచిని మైకులో చెప్పి, చెడును చెవిలో చెప్పాలని సూచించారు. అయితే చెడును చెప్పాలని అంటూనే సొంత పార్టీ నేతలను ఉద్దేశించి ఎర్రోళ్లు, ఎర్రి కుక్క కరిసినోళ్లు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు కొంత ఇబ్బందికరంగా ఉన్నాయనే భావన వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధిష్టానం గమనిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఇదివరకే ప్రకటించారు. అయినా సరే రాజగోపాల్ రెడ్డి మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మంత్రి పదవి రాలేదని చాలా కాలంగా అసంతృప్తితో ఉన్న ఆయన ఇటీవల కాంట్రాక్టుల విషయంలోనూ ఆరోపణలు చేశారు. మొత్తానికి పరిస్థితి చూస్తుంటే తెలంగాణ కాంగ్రెస్‌లో ఇంటిపోరు మరింత ముదిరేలానే కనిపిస్తోంది.

ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీ

ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీఓకు వెళ్లేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఖనిజ నిక్షేపాల అన్వేషణ కోసం 74,860 చదరపు కిలోమీటర్ల పరిధిలో 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు అధికారులు వివరించారు. వీటిని 209 క్లస్టర్లుగా విభజించినట్లు వెల్లడించారు. ఖనిజాల అన్వేషణ, నిర్వహణకు మరింత ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్ఈడీసీ) ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణతో పాటు వాటి విలువను పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

6,500 క్వారీ దరఖాస్తుల పరిష్కారానికి గడువు పొడిగింపు

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షలో చర్చించారు. వీటిని పరిష్కరించేందుకు గడువు పొడిగించే ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారమైతే ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంచనా వేశారు.

ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియ వేగవంతం

వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేసేలా సమగ్ర ప్రణాళికలు అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. మైనింగ్ రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ ఖనిజ సంపదను సమర్థంగా వెలికితీయాలని, పెట్టుబడులను ఆకర్షించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు.

మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ

రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరాను నిర్ధారించేందుకు ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోని మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మూడు బ్లాకుల్లో కలిపి 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు వివరించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది

అంతేకాదు, ఇటీవల ఎన్నికలు జరిగిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీజేపీ జెండా ఎగిరింది. త్వరలో జరగనున్న మరో రెండు ఎమ్మెల్సీ స్థానాలు తమ ఖాతాలోకే చేరడం ఖాయం" అని కేంద్ర మంత్రి జోస్యం చెప్పారు. తెలంగాణ, కర్ణాటకతో పాటు హిమాచల్ ప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదని ఆయన అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనని, వారిపై ప్రజల్లో తీవ్ర అసహనం గూడుకట్టుకుందని పేర్కొన్నారు. ఆ పార్టీలను తెలంగాణ ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తున్నారని, రాబోయే రోజుల్లో వాటికి ఓటు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, తమ ఆకాంక్షల సాకారం మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమని ప్రజలు బలంగా నమ్మతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కమలం వికాసం తథ్యమని కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ ప్రజల నాడి పట్టుకోవడంలో రాహుల్ గాంధీ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ నాయకులు సహా ఆయన దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా ఒకే ఎజెండాతో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. విపక్ష నేత కనీసం అవగాహన లేకుండా దేశంపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ సంస్థలను అంతర్జాతీయ వేదికలపై అవమానిస్తున్నారని తూర్పారబట్టారు. ఇది ప్రధాని మోదీని అవమానించడం కాదని దేశ ప్రజలను అవమానించడమనేని పేర్కొన్నారు.

ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

వెల్లడించిన ఫలితాల ప్రకారం, కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపకం, గెలుపు స్పష్టంగా కనిపించింది. తెలుగు దేశం పార్టీ అత్యధికంగా 22 జడ్పీ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకుని అగ్రస్థానంలో నిలిచింది. జనసేన పార్టీ కీలకమైన నాలుగు జడ్పీ పీఠాలను దక్కించుకుని తన సత్తా చాటింది. భారతీయ జనతా పార్టీ ఒక జడ్పీ ఛైర్మన్ స్థానాన్ని తన అకౌంట్‌లో వేసుకుంది.

ఒక్క జిల్లాకే పరిమితమైన వైసీపీ

గత ఎన్నికల పరాజయం నుంచి ఇంకా కోలుకోని ప్రతిపక్ష వైసీపీ ఈ జడ్పీ ఎన్నికల్లో కూడా గట్టి దెబ్బ తగిలింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్‌ను మాత్రమే ఆ పార్టీ నిలబెట్టుకోగలిగింది. అల్లూరి జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్‌గా వైసీపీ అభ్యర్థి వంతల శాంతి ఎన్నికయ్యారు. మిగిలిన 27 జిల్లాల్లో వైసీపీకి ప్రాతినిధ్యం లేకుండా పోయింది.

ముగిసిన ఎన్నికల ఘట్టం

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా కొత్త చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా, ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల వివరాలతో కూడిన ఫైనల్ అధికారిక లిస్టును రాష్ట్ర ఎన్నికల కమిషన్ రిలీజ్ చేసింది. దీంతో కొద్ది రోజులుగా రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపిన జిల్లా పరిషత్ పాలక వర్గాల ఎన్నికల ప్రక్రియకు అధికారికంగా తెరపడినట్టైంది. గ్రామీణాభివృద్ధిలో కొత్త పాలక వర్గాలు కీలక పాత్ర పోషించనున్నాయి.

సిద్ధిపేటలో నాపై పోటీ చేయ్.. తేల్చుకుందాం

మొత్తం అబద్ధాలు, విమర్శలతోనే సాగిందని మండిపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు ఈ వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేటలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి, ఆ పథకం గురించి మాట్లాడకుండా తనతో పాటు కేసీఆర్, కేటీఆర్ పేర్లను పదేపదే ప్రస్తావించారని విమర్శించారు. సిద్దిపేట సభలో రేవంత్‌రెడ్డి ముఖంలో తీవ్ర నిరాశ, అసహనం కనిపించాయని అన్నారు. తమ పేర్లను సీఎం ఏకంగా 140 సార్లు తలచుకున్నారని వ్యాఖ్యానించారు. తనను తాటిచెట్టుతో పోల్చుకుంటూ, రేవంత్‌రెడ్డిని గన్నేరు చెట్టుతో పోల్చారు. కుట్రలు చేయడం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రికి లేదని విమర్శించారు. ఆయన ప్రసంగంలో అబద్ధాలు, బూతులు తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్క మాట కూడా లేదని మండిపడ్డారు.సిద్దిపేట సభకు ఇతర జిల్లాల నుంచి ప్రజలను తరలించారని ఈ విషయాన్ని సిద్దిపేట కమిషనరే తనతో చెప్పారని హరీశ్‌రావు పేర్కొన్నారు. అంతకుముందు సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేశారు. 2029 ఎన్నికల్లో తెలంగాణలోనే కాకుండా సిద్దిపేట గడ్డపైనా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఆ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. ప్రజలు కోరుకున్న నాయకుడికే కాంగ్రెస్ టికెట్ ఇస్తామని ఆ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత ప్రజలదేనని అన్నారు.తెలంగాణ సాగునీటి హక్కులను సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. చంద్రబాబు జలదోపిడీకి సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటాకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని రాష్ట్రం ఏర్పడిన 40 రోజుల్లోనే కృష్ణా జలాల పునఃపంపిణీ చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారని గుర్తుచేశారు. కృష్ణా ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర ప్రభుత్వం సరైన వాదనలు వినిపించడం లేదని ఆరోపించారు.నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం అబద్ధమని హరీశ్‌రావు పేర్కొన్నారు. దేవాదుల వద్ద మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి నీటిని ఎందుకు ఎత్తిపోసుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కిన వాటాను కూడా ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకోవడం లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలన బాగోలేదని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే బహిరంగంగా మాట్లాడుతున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడంలో ఆస్కార్ అందుకోవచ్చని సెటైర్లు వేశారు. కరువు, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని.. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ సత్తా చూపించిందని హరీశ్‌రావు అన్నారు. పలువురు నేతలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. తమపై ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

కేసీఆర్ నా కథలో రావణాసురుడు

రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం తలుచుకుంటే ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, కానీ ప్రతిపక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే దాన్ని కొనసాగిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి ఎలాంటి ముఖ్య పాత్ర లేదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో, గతంలో ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, త్వరలో క్రిస్టియానో రొనాల్డోను తెలంగాణకు ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ అప్పులు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, లోక్‌సభ సీట్ల పునర్విభజన వంటి అంశాలను ప్రస్తావిస్తూనే, రాష్ట్రంలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' గురించి కూడా మాట్లాడారు.

ఉగ్రవాదులకు ప్లాన్లు ఇస్తున్న ఏఐ

ఏకంగా ఒక చిత్రాన్నే గీసి ఇచ్చింది. మరో చాట్‌బాట్ అయితే, డ్రోన్‌తో విద్యుత్ సబ్‌స్టేషన్‌పై ఎలా దాడి చేయాలో దశలవారీగా వివరించింది. హింస, నేరపూరిత సమాచారం ఇవ్వకుండా ఏఐ కంపెనీలు భద్రతా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, వాటిని అధిగమించే అవకాశం ఉందని ఈ పరిశోధన నిరూపించింది. ఇంతటి ప్రమాదకరమైన టెక్నాలజీ తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ఏఐ కంపెనీలు తీసుకుంటున్న భద్రతా చర్యలపై జీఏవో తీవ్ర ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు, తమ చాట్‌బాట్‌లు ప్రమాదకరమైన సమాచారాన్ని అందించే అవకాశం ఉందని వాటిని రూపొందించిన కంపెనీలు అంగీకరించాయి. అయితే, జీఏవో పరిశోధన పద్ధతులను మాత్రం సవాలు చేశాయి. ఏదేమైనా, ఏఐ సాంకేతికత భద్రత విషయంలో మరింత కఠినమైన నిబంధనలు అవసరమనే వాదనకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.

బీరంగూడలో వైభవంగా అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

- గరుడన్ పరవ, కేరళ సంప్రదాయ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణ
- భక్తిశ్రద్ధలతో సాగిన ఉత్సవ మూర్తుల ఊరేగింపు
- రెండో రోజు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక శోభ



అమీన్ పూర్ (ప్రశ్న న్యూస్) పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో

సీఎం సభకు వెళ్లొస్తుండగా
రెండు బస్సుల మధ్య నలిగి మహిళ మృతి

- 5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేసిన పొన్నం



సిద్దిపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు హాజరై తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న ఓ మహిళను మృత్యువు కబళించింది. బస్సు ఎక్కే క్రమంలో పక్క నుంచి మరో బస్సు రావడంతో రెండింటి మధ్య చిక్కుకుని ఆమె ప్రాణాలు కోల్పోయింది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో ఈ ఘటన తీరని విషాదాన్ని నింపింది. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన ముఖ్యమంత్రి సభకు హుస్నాబాద్ మండలం నాగారం గ్రామానికి చెందిన కొమ్ము సారవ్వ (55) హాజరైంది. సభ ముగిసిన తర్వాత స్వగ్రామానికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ప్రమాదం జరిగింది. ఆమె ఎక్కుతున్న బస్సు పక్క నుంచి మరో బస్సు రావడంతో రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోయింది. తీవ్ర గాయాలైన సారవ్వ అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. సారవ్వ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇప్పటికే పేదరికంలో ఉన్న కుటుంబానికి ఆమె మరణం తీరని లోటుగా మారింది. సభకు వెళ్లిన తల్లి తిరిగి వస్తుందని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు ఆమె మరణవార్త పిడుగులా మారింది. తల్లిని కోల్పోయిన పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. నాగారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.కుటుంబానికి మంత్రి పొన్నం భరోసా.. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాసారవ్వ మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఆమె పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హైమావతి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. తక్షణ సహాయంగా ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. సారవ్వ మహిళా సంఘం సభ్యురాలు కావడంతో ఆ సంఘం సభ్యులకు వర్తించే రూ.10 లక్షల ప్రమాద బీమా కూడా అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ప్రారంభ దశలోనే పైల్స్‌ను గుర్తిస్తే మందులతోనే నియంత్రణ

- కరీంనగర్ మెడికవర్‌లో అత్యాధునిక లేజర్ చికిత్స
అందుబాటులో.. వారం రోజుల పాటు ఉచిత వైద్య సంప్రదింపులు



కరీంనగర్ పైల్స్ సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్య చికిత్స తీసుకుంటే చాలా సందర్భాల్లో శస్త్రచికిత్స అవసరం లేకుండానే నియంత్రించవచ్చని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రతను బట్టి మందులు, ఆహార నియమాలు, జీవనశైలి మార్పులతో పాటు అవసరమైన వారికి అత్యాధునిక లేజర్ చికిత్స, శస్త్రచికిత్స అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.శుక్రవారం ప్రపంచ పైల్స్ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో జనరల్ సర్జన్ డాక్టర్ తాహా, అనెస్థీషియా విభాగాధిపతి డాక్టర్ వినయ్ మాట్లాడారు. పైల్స్ సమస్యపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మలద్వారం వద్ద రక్తస్రావం, నొప్పి, మంట, దురద, వాపు, గడ్డలు ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తే మొహమాటం లేకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు.మలబద్ధకం, ఆహారంలో పీచు పదార్థాలు తక్కువగా తీసుకోవడం, తగినంత నీరు తాగకపోవడం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో పైల్స్ సమస్య వచ్చే అవకాశం ఉందని వివరించారు. ముఖ్యంగా టాయిలెట్‌లో సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని, ఎక్కువసేపు కూర్చునే అలవాటును మానుకోవాలని సూచించారు. సమస్యను మసాలా ఆహారం లేదా మద్యం వల్ల వచ్చిందని భావించి నిర్లక్ష్యం చేయకుండా, సొంత వైద్యం చేసుకోకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని తెలిపారు.ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా పైల్స్ సమస్యను నివారించవచ్చని వైద్యులు సూచించారు. అవసరమైన రోగులకు ఆధునిక లేజర్ చికిత్స అందుబాటులో ఉందని, చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిని బట్టి త్వరగా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వివరించారు.ప్రపంచ పైల్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో వారం రోజుల పాటు పైల్స్ సమస్యతో బాధపడేవారికి ఉచిత వైద్య సంప్రదింపులు నిర్వహించనున్నట్లు వైద్యులు ప్రకటించారు.ఈ కార్యక్రమం ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరగగా, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, మెడికల్ హెడ్ డాక్టర్ ప్రియాంక, ఆర్ఎంఓ డాక్టర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలపై కీలక ప్రకటన..

- గోదావరి పుష్కర స్నానాలపై కీలక ప్రకటన
- పుణ్య స్నానాలకు ముహూర్తం ఏమీ లేదని క్లారిటీ
- గోదావరి రేవుల్లో ఎక్కడ స్నానం ఆచరించినా పుణ్యమే

రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్‌లో 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం జరుగుతున్నాయని దేవాదాయశాఖ కమిషనర్ కె రామచంద్ర మోహన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తేదీలు ఖరారు చేసిందని.. పుణ్య స్నానాలు చేసేందుకు ప్రత్యేకంగా ముహూర్తం అంటూ ఏదీ లేదన్నారు. ఆయన రాజమహేంద్రవరం దేవాదాయశాఖ కార్యాలయంలో పండితులతో గోదావరి పుష్కరాలకు సంబంధించి సమీక్ష చేశారు. గోదావరి పుష్కరాలకు సంబంధించిన ముహూర్తాలు, ఇతర అంశాలపై పండితులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, అధికారులతో చర్చించారు.2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు పుష్కరాలకు తేదీలు ఖరారు చేసిందని.. మొదటి రోజు నుంచి 12వ రోజు వరకు ప్రతి రోజూ సూర్యోదయం నుంచి ఏ ఘడియలోనైనా, ఏ ఘాట్‌లోనైనా పుణ్యస్నానం చేయొచ్చన్నారు. మొదటి సూర్యోదయం నుంచి చివరి రోజు సూర్యాస్తమయం వరకు ఎప్పుడైనా స్నానం చేయొచ్చన్నారు. పుష్కరాల రోజుల్లో గోదావరి రేవుల్లో ఎక్కడ స్నానం ఆచరించినా పుణ్యమేనని రామచంద్రమోహన్ తెలిపారు. గోదావరి పుష్కరాల సమయంలో 12చోట్ల హారతులు, యాగాలు, హోమాలు నిర్వహిస్తామని.. పుష్కరాలకు ముందు గోష్పాద క్షేత్రం నుంచి కలశ యాత్ర నిర్వహించబోతున్నట్లు తెలిపారు.గోదావరి తీరంలో సూర్య, బృహస్పతి ఆలయాలు నిర్మిస్తామన్నారు రామచంద్రమోహన్. దేవాదాయశాఖ, పర్యాటకశాఖ, ఆర్టీసీ సంయుక్తంగా ఆరు సర్క్యూట్లుగా విభజించి 35 దేవాలయాలు అనుసంధానం అయ్యేలా ప్యాకేజీలు రూపొందించబోతున్నామన్నారు. గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రికులు తమకు నచ్చిన ఆలయాలను దర్శించుకునేలా ఒక్కో ప్యాకేజీలో 6 నుంచి 7 ఆలయాలు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు.ఈసారి గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది వస్తారనే అంచనాలు ఉన్నాయని.. అందుకే అన్ని శాఖల్ని సమన్వయం చేసుకుని పనులు చేస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలకు ఆరు జిల్లాల్లోని అన్ని ఘాట్లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి పుష్కరాల కోసం దేవదాయ శాఖ ద్వారా ఆరు జిల్లాల పరిధిలో రూ.126 కోట్లతో 563 పనులకు ప్రతిపాదనలు రాగా.. వీటిలో 520 పనులకు పరిపాలనామోదం లభించిందన్నారు. 400 పైగా పనులకు టెండర్లు పూర్తిచేయగా.. ఆ పనులు వివిధ దశల్లో ఉన్నాయ ని తెలిపారు. 2027 మార్చి చివరి నాటికి గోదావరి పుష్కరాల పనులన్నీ పూర్తి చేస్తామన్నారు.

చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలి

- ఆదివాసి సంఘాల పిలుపు

గుడిహత్నూర్: ఆదివాసీల హక్కుల సాధన, ఆదివాసీ అస్తిత్వ పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల అమలు లక్ష్యంగా డిసెంబర్ 9న హైదరాబాద్ లో నిర్వహించనున్న లక్షలాది మంది ఆదివాసీల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ పిలుపునిచ్చారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కొమురం భీం విగ్రహం వద్ద చలో హైదరాబాద్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 9 తెగల ఆదివాసీ ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఆదివాసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

ఆదివాసీల హక్కులు కాపాడుకోవాలంటే అందరూ ఒక్క తాటిపైకి రావాల్సిన సమయం వచ్చిందని, డిసెంబర్ 9 సభ ఆదివాసీ ఐక్యతకు చారిత్రక ఘట్టం కాబోతుందని ఆయన అన్నారు.తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెందోర్ జలపతిఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్, ఆదివాసీ జెఏసి గుడిహత్నూర్ మండల చైర్మన్ ఉర్వేత రోహిత్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు మేస్రం మోహన్, ఆదివాసీ సేన జిల్లా కార్యదర్శి కుంరం చత్రుఘన్, రాజ్ గోండ్ సేవా సమితి మండల అధ్యక్షులు కోవ భగవాన్, ఆదివాసి విద్యార్థి సంఘం ఇచ్చోడ మండల అధ్యక్షులు నైతం పండరినాథ్, ఆదివాసీ సేన మండల ఉపాధ్యక్షులు సలాం జాకు, గోండ్వానా రాయి సెంటర్ సార్మేడి కాత్లె భరత్, ఉప సార్మేడి మేస్రం జంగు, మాజీ సార్మేడి పేందోర్ మారుతి రావు, ఆదివాసీ సర్పంచ్ ఫోరం మడావి ముకుంద్ రావు, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుడ్మేత జంగు, కాంగ్రెస్ పార్టీ ఆశావహ జెడ్పీటీసీ అభ్యర్థి పేందోర్ జీవన్ మహారాజ్, ఆత్రం బాలు, కుస్రం సీతారాం, 9 తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, పటేల్ లు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి డబుల్ జీవిత ఖైదు

- నల్లగొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు



నీలగిరి, హత్య కేసులో దోషిగా తేలిన వ్యక్తికి డబుల్ జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. కేసు వివరాలు. నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 27-08-2025 రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో దేవరకొండ రోడ్డులోని ప్రతీక్ రెడ్డి మెమోరియల్ బాయ్స్ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ సమీపంలో నాంపల్లి మండలం, వడ్డేపల్లి గ్రామానికి చెందిన చింతకింది రమేశ్ (40) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. రాత్రి నిద్రించే స్థలం విషయంలో రమేశ్‌కు, కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ జిల్లాకు చెందిన షేక్ సిరాజ్ అలియాస్ సిల్లు (40)కు మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు షేక్ సిరాజ్, నిద్రిస్తున్న రమేశ్ తలపై బండరాయితో బలంగా కొట్టి హత్య చేశాడు. ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ రాజశేఖర్ రెడ్డి కేసు నమోదు చేశారు. సీసీ టీవీ కెమెరాలో హత్య ఘటన నిక్షిప్తమై ఉండడంతో ఆ దృశ్యాలు సమగ్ర దర్యాప్తు, సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను కోర్టులో సమర్పించారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు షేక్ సిరాజ్ అలియాస్ సిల్లు (40)ను దోషిగా తేల్చుతూ బీఎన్ఎస్ సెక్షన్ 103(1) ప్రకారం హత్య నేరానికి జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశించింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం సెక్షన్ 3(2)(లజీ) కింద జీవిత ఖైదుతో పాటు మరో రూ.5,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. రెండు జీవిత ఖైదు శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో దర్యాప్తు నిర్వహించిన నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి, అప్పటి నల్లగొండ వన్ టౌన్ సీఐ ఎ. రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ జె. సైదులు పోలీస్ అధికారులుగా కీలకంగా వ్యవహరించారు. అదేవిధంగా న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతంగా వాదనలు వినిపించిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-1 ఎస్.శోభారాణి, డీసీఆర్బీ సీఐ శ్రీను నాయక్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, లైజన్ అధికారులు నరేందర్, మల్లికార్జున్‌ల కృషిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

టిప్పర్ ఢీకొని మహిళా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయురాలు మృతి

- సూర్యాపేటలో ఘోర రోడ్డు ప్రమాదం - స్కూటీపై వెళ్తుండగా ఘటన

సూర్యాపేట టౌన్, నవంబర్ 20 : సూర్యాపేట పట్టణ పరిధిలోని బీబీగూడెం నుండి మార్కెట్‌కు వెళ్లే మార్గంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలను టిప్పర్ వాహనం ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను చివ్వెంల మినీ గురుకులంలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న రజితా రెడ్డి, అదే పాఠశాలలోఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రక్మగా గుర్తించారు. ఒకే విద్యాసంస్థలో పని చేస్తున్న ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో తీవ్ర విషాదఛాయలను నింపింది. ఈ ఘటనతో వారి కుటుంబ సభ్యులు, సహచర ఉపాధ్యాయులు తీవ్రగ్రాంతికి గురయ్యారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

టేకులపల్లిలో ఇసుక ట్రాక్టర్ బోల్తా..

- యువకుడు మృతి..

టేకులపల్లి : ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కుటుంబానికి ఆసరాగా ఉన్న భర్తను కోల్పోయి తొమ్మిది నెలల గర్భిణి అయిన భార్య, ఐదేళ్ల కుమార్తె దిక్కులేనివారయ్యారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం గంగారం పంచాయతీ పరిధిలోని చర్లపల్లికి చెందిన మధు ఇసుక ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా అదే పనికి వెళ్లాడు. సంపత్ నగర్ నుంచి టేకులపల్లి వైపు వస్తుండగా అదుపుతప్పిన ఇసుక ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజన్ మధుపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు. ఇసుక ట్రాక్టర్లపై నిఘా ఏదీ?: మండలంలో ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు, వాటి వేగంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భర్తను కోల్పోయి తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్న ప్రియ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన మేయర్ ముక్కా శ్రావణి తండ్రి మృతి



విశాఖ: నగర నూతన మేయర్ ముక్కా శ్రావణి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆమె తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆకస్మిక అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. కుమార్తె మేయర్ గా ప్రమాణ స్వీకారం చూడకుండానే తండ్రి మృతిపై సర్వత్ర దిగ్భ్రాంతి వ్యక్తమయింది. ముత్యాలనాయుడు మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌తో పాటు పలువురు టీడీపీ నేతలు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఇటీవల జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసిన ముక్కా శ్రావణి 2,44,644 ఓట్ల భారీ మెజారిటీతో మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. మొత్తం 120 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 98 వార్డుల్లో విజయం సాధించారు.

చేయూత కోసం వృద్ధుల ఎదురుచూపులు..

- నిజామాబాద్‌లో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

నిజామాబాద్ జిల్లాలో చేయూత పింఛన్ కోసం వృద్ధులు ఎదురుచూస్తున్నారు. వృద్ధులకు 4,016 రూపాయల చేయూత పింఛన్ అందిస్తామన్న హామీ మూడేళ్లు గడుస్తున్నా అమలు కాలేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం 2,016 రూపాయల ఆసరా పింఛన్ అందించింది. అనర్హులను తొలగించి కొత్తవారికి పింఛన్లు ఇస్తున్నా వృద్ధులు, బీడీ కార్మికులకు అవకాశం దక్కలేదని వాపోతున్నారు. పున్నవాటి పెంపు కోసం, కొత్త పింఛన్ల కోసం మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

పోలీస్ స్టేషన్‌లోనే సీమంతం..

- మహిళా కానిస్టేబుల్‌కు సహచరుల ఆత్మీయ వేడుకలు



పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ మంగమ్మకు ఎస్పీ ఇటీవల మెటర్నిటీ లీవ్ మంజూరు అయింది. సెలవుపై వెళ్తున్న ఆమెకు సీఐ బి. వెంకట్రావు ఆధ్వర్యంలో తోటి సిబ్బంది స్టేషన్ ఆవరణలోనే సంప్రదాయబద్ధంగా సీమంతం చేశారు. ఇంటి బిడ్డలా భావించి పసుపు, కుంకుమ, గాజులు, కొత్త బట్టలు పెట్టి, అక్షింతలు వేసి తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలని ఆశీర్వదించారు. పోలీసుల్లోని ఈ ఆత్మీయ కోణానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

కూతురి పెళ్లి కోసం రూ.25 వేల అప్పు..

- 4.5 ఎకరాల భూమి కోల్పోయిన మహిళకు 30 ఏళ్ల తర్వాత న్యాయం!

లాతూర్ జిల్లా కూతురి పెళ్లి కోసం తీసుకున్న అప్పు ఓ మహిళకు మూడు దశాబ్దాల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసింది. కేవలం రూ.25 వేల కోసం తాకట్టు పెట్టిన 4.5 ఎకరాల భూమి చివరకు చేజారిపోయింది. అప్పు తీర్చేందుకు రూ.2.5 లక్షలు ఇస్తానన్నా వడ్డీ వ్యాపారి కనికరించలేదు. అసలు, వడ్డీ కలిపి రూ.10 లక్షలు కట్టాల్సిందేనని పట్టుబట్టాడు. అంత మొత్తం చెల్లించలేక ఆ మహిళ ఏళ్ల తరబడి తన భూమికి దూరమైంది. అయితే మూడు దశాబ్దాల తర్వాత ఆమెకు ఊహించని ఊరట లభించింది. అధికారుల చొరవతో ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే తన 4.5 ఎకరాల భూమిని తిరిగి దక్కించుకుంది. మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లాతూర్ జిల్లా చాకూర్ తాలూకా కల్ముధి గ్రామానికి చెందిన ముందుబాయి ఇరప్ప దావ్రే.. దాదాపు 30 ఏళ్ల క్రితం తన కుమార్తె వివాహ ఖర్చుల కోసం ఓ ప్రైవేటు వడ్డీ వ్యాపారి వద్ద రూ.25 వేలు అప్పు తీసుకుంది. ఇందుకోసం తనకున్న 4.5 ఎకరాల భూమిని తాకట్టు పెట్టింది. తొలుత పంటలో వాటా ఇస్తానని చెప్పిన వడ్డీ వ్యాపారి.. ఆ తర్వాత భూమిపై ఆధిపత్యం చెలాయించాడు. నకిలీ సాక్షులను ఉపయోగించి భూమిని తన పేరు మీదకు మార్చుకున్నాడు. అయితే తీసుకున్న అప్పు తీర్చి తన భూమిని తిరిగి దక్కించుకోవాలని ముందుబాయి ప్రయత్నించింది. ఇందుకోసం అసలు, వడ్డీ కలిపి 2.5 లక్షల వరకు చెల్లించేందుకు సిద్ధమైంది. కానీ వడ్డీ వ్యాపారి మాత్రం అప్పు, వడ్డీ కలిపి మొత్తం 10 లక్షలు చెల్లించాలని లెక్కలు చెప్పాడు. భూమి కావాలంటే చెప్పినంత కట్టాల్సిందేనని డిమాండ్ చేశాడు. దీంతో చేసేదేమీ లేక ముందుబాయి ఆవేదనతో ఉండిపోయింది. అలా దాదాపు 30 ఏళ్లు గడిచిపోయింది. తాజాగా కుటుంబసభ్యులు ఆర్థికంగా అండగా నిలవడంతో ముందుబాయి లతూర్ జిల్లా అధికారులను ఆశ్రయించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన కలెక్టర్ భరత్ బస్తవాడ్.. రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ అనుమతితో రెవెన్యూ అధికారులు భూమి రికార్డుల్లో మార్పుల చేసి, ముందుబాయినే యజమానిగా నమోదు చేశారు. దీంతో 30 ఏళ్ల కిందట కోల్పోయి 4.5 ఎకరాల భూమి ఆమెకు తిరిగి దక్కింది.గురువారం లాతూర్ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. ముందుబాయికి భూమికి సంబంధించిన 7/12 (సాత్‌బారా) పత్రంతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తన భూమిని ఎలాంటి డబ్బు చెల్లించకుండానే తిరిగి ఇప్పించారని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. ఈ విషయంలో సహకరించిన కలెక్టర్, ఎస్పీ అమోల్ తాంబే, స్థానిక తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

- విద్యార్థుల్లో విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు దోహదం



ఏలూరు (ప్రశ్న న్యూస్) విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించి, విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు వేదికలుగా నిలవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగ నాగరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఎం.జె. అభిషేక్ గౌడ్ ఆకాంక్షించారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజం పట్ల అవగాహన, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం (నవంబర్ 20) నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగ నాగరాజు సభాధ్యక్షత వహించగా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఎం.జె. అభిషేక్ గౌడ్ ముందుగా వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని వారం రోజులపాటు విద్యార్థులకు వివిధ విజ్ఞాన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమాలకు ఇన్నర్ వీల్ క్లబ్ ఏలూరు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, సాహిత్య మండలి, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, రసన సాహితి సాంస్కృతిక సంస్థ తదితర సంస్థలు సహకారం అందించాయి. ఆయా సంస్థల ప్రతినిధులు విద్యార్థులకు పలు సాంస్కృతిక, విజ్ఞాన కార్యక్రమాల ద్వారా ప్రోత్సాహం అందించారు.ఈ ముగింపు వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, వి. శిరీష, జి. అచ్యుత, ఉషా, ఎం.జె. సుజయ కృష్ణ, కె. సోమ్లా నాయక్, ఎం. అజయ్ బాబు, పి. రత్నాకరరావు, పి. పురుషోత్తమరావు, పి. సత్యవాణి తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి పెద్దపీట

- పారదర్శకంగా బదిలీలు, పదోన్నతులు: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు(ప్రశ్న న్యూస్) పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కారమైతేనే విధి నిర్వహణలో మరింత ఉత్సాహం, అంకితభావం, సమర్థత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, వ్యక్తిగత సమస్యలు, సేవా సంబంధిత అంశాలు, ఇతర పరిపాలనా సమస్యలపై పోలీస్ సిబ్బంది తమ అభ్యర్థనలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రతి వినతిపై ప్రత్యేక పరిశీలన

గ్రీవెన్స్ డేకు వచ్చిన ప్రతి వినతిని జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. సమస్యల తీవ్రత, సంబంధిత శాఖ నిబంధనలు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వాటిపై సానుకూలంగా స్పందించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు.పోలీస్ సిబ్బందికి తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమం సిబ్బందిలో భరోసాను పెంపొందించడంతో పాటు శాఖలో సమన్వయం, సానుకూల పని వాతావరణానికి దోహదపడుతోందని ఈ సందర్భంగా స్పష్టమవుతోంది.

పౌరసరఫరాల శాఖ కమిషనర్ నాగిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జిఎంఆర్,

- రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు..

- డీలర్ల సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి



పటాన్చెరు(ప్రశ్న న్యూస్) రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నూతన కమిషనర్ గా ఇటీవల నియమితులైన నాగిరెడ్డిని పటాన్చెరు శాసనసభ్యులు, తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలోని డీలర్ల సంక్షేమ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. శుక్రవారం హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీలర్లకు గౌరవ వేతనం, క్వింటాలుకు 300 రూపాయల కమిషన్, ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ వే బ్రిడ్జిల ఏర్పాటు, 10 లక్షల రూపాయల ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, తదితర అంశాలను అమలు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నాగిరెడ్డి.. ప్రభుత్వంతో చర్చించి డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు, రాష్ట్ర ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిర్మయంగా శ్రీశైలం..

భక్తి సాగరంలో కోటి దీపోత్సవం

- కైలాస పర్వతాన్ని తలపించేలా ప్రత్యేక వేదిక..

- మల్లన్నకు దశవిధ హారతులతో మహా మంగళహారతి..

- ప్రముఖ గాయకుడు మనో బృందంతో భక్తి సంగీత స్వరార్చన..

- కార్తీక మాసంలో ఆధ్యాత్మిక వైభవానికి అద్దం పట్టనున్న మహోత్సవం









శ్రీశైలం (ప్రశ్న న్యూస్) కార్తీక మాసం.. శివనామ స్మరణతో మారుమోగే పవిత్ర సమయం. దీపారాధన.. భక్తి భావానికి ప్రతిరూపం. శివయ్య సన్నిధిలో వెలిగే ప్రతి దీపం భక్తుల మనసుల్లో జ్ఞానజ్యోతిని నింపుతుందనే విశ్వాసం. అటువంటి పవిత్ర కార్తీక మాసోత్సవాల సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో కోటి దీపోత్సవానికి దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం నిర్వహించనున్న ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. దీపకాంతుల మధ్య శివనామస్మరణ, వేదమంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజలు, దశవిధ హారతులతో శ్రీశైల క్షేత్రం భక్తి పారవశ్యంలో మునిగిపోనుంది.దేవస్థాన ఆగమ పాఠశాల ఎదురుగా ఉన్న విశాలమైన మైదానంలో సాయంత్రం 6 గంటల నుంచి కోటి దీపోత్సవ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకోసం కైలాస పర్వత నమూనాలో ప్రత్యేక వేదికను రూపొందించడం విశేషం. పరమశివుడి నివాసమైన కైలాస పర్వతాన్ని తలపించేలా సిద్ధం చేసిన ఈ వేదికపై శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి అవసరమైన పూజా ద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చడం విశేషం. భక్తులు దీపాలను వెలిగిస్తూ స్వామివారి అనుగ్రహాన్ని పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

దీపజ్యోతిలో దైవత్వం.. కార్తీకంలో ఆధ్యాత్మిక పరవశం..

హిందూ వైదిక సంప్రదాయంలో దీపానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించేది దీపజ్యోతి అని ఆధ్యాత్మిక గ్రంథాలు వివరిస్తున్నాయి. దీపారాధన అనేది కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు.. భగవంతుని పట్ల భక్తుడు వ్యక్తం చేసే ఆత్మీయ సమర్పణ. కార్తీక మాసంలో శివాలయాల్లో దీపాలు వెలిగించడం, దీపదానం చేయడం, శివనామ స్మరణ చేయడం అత్యంత పుణ్యప్రదంగా భక్తులు భావిస్తారు. ఈ నేపథ్యంలో శ్రీశైలంలో నిర్వహించే కోటి దీపోత్సవం ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకుంది.

పది రకాల హారతులు.. పరమశివునికి విశేష సమర్పణ..

ఈ కోటి దీపోత్సవంలో ప్రధాన ఆకర్షణగా శ్రీ స్వామి అమ్మవార్లకు దశవిధ హారతులను సమర్పించనున్నారు. ఓంకార హారతి, నాగహారతి, త్రిశూల హారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతి ఇలా పది రకాల హారతులతో స్వామి అమ్మవార్లకు వైభవంగా ఆరాధనలు జరగనున్నాయి. ఓంకారం పరబ్రహ్మ స్వరూపానికి ప్రతీకగా భావిస్తారు. ఓంకార హారతిని దర్శించడం వల్ల కష్టాలు తొలగి సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. నాగహారతి సర్పదోష నివారణకు, సంతాన ప్రాప్తికి సంకేతంగా పేర్కొంటారు. త్రిశూల హారతి అకాలమృత్యు భయాలు, గ్రహదోషాల నివారణకు ప్రతీకగా భావిస్తారు. నంది హారతి భయాన్ని, దుఃఖాన్ని తొలగించి ఆనందం, ఉత్సాహాన్ని ప్రసాదిస్తుందని చెబుతారు. సింహహారతి శత్రుబాధలను తొలగించి మనోధైర్యాన్ని కలిగిస్తుందని ఆధ్యాత్మిక విశ్వాసం. అదేవిధంగా సూర్యహారతి ఆరోగ్యాన్ని, దీర్ఘాయుష్షును ప్రసాదిస్తుందని, చంద్రహారతి మనశ్శాంతికి ప్రతీకగా నిలుస్తుందని చెబుతారు. కుంభహారతి సంపదలు, కోరికల నెరవేర్పునకు, నక్షత్రహారతి జాతక దోషాల నివారణకు, చేపట్టిన పనుల్లో విజయానికి సంకేతంగా భావిస్తారు. చివరగా సమర్పించే కర్పూరహారతి పాప పరిహారానికి, అష్టైశ్వర్య ప్రాప్తికి ప్రతీకగా భక్తులు విశ్వసిస్తారు. ఈ పది హారతుల సమర్పణతో కోటి దీపోత్సవం మరింత వైభవాన్ని సంతరించుకోనుంది.

జ్ఞానానికి, శాంతికి దీపం ప్రతీక: ఈఓ శ్రీనివాసరావు

దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ దీపం జ్ఞానం, వెలుగు, ఉత్సాహం, ఆనందం, శాంతికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. దీపారాధన ద్వారా ఈ దివ్యగుణాలను పొందవచ్చని పండితులు పేర్కొంటున్నారని వివరించారు. శ్రీ స్వామి అమ్మవార్లకు దీపజ్యోతిని సమర్పించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని తెలిపారు. కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కార్తీక శోభకు కోటి దీపాల కాంతి..

శివభక్తికి, సనాతన సంప్రదాయానికి, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే శ్రీశైల క్షేత్రంలో కోటి దీపోత్సవం భక్తులకు అపూర్వమైన అనుభూతిని అందించనుంది. కైలాస పర్వత సమూనాలో ప్రత్యేక వేదిక, దశవిధ హారతులు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంప్రదాయ నృత్యాలు, మనో బృందం భక్తి సంగీతం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వెలిగే ప్రతి దీపంలో భక్తి భావం.. వినిపించే ప్రతి శివనామంలో ఆధ్యాత్మిక పరిమళం.. కనిపించే ప్రతి జ్యోతిలో పరమేశ్వరుని దివ్యత్వాన్ని దర్శించుకునేలా ఈ మహోత్సవం రూపుదిద్దుకుంది. కార్తీక మాస పవిత్రతను చాటుతూ శ్రీశైలంలో జరగనున్న కోటి దీపోత్సవం శివభక్తుల హృదయాల్లో చిరస్మరణీయ ఆధ్యాత్మిక అనుభూతిగా నిలవనుంది.

తెలంగాణ విప్లవ నాయకుడు, స్వాతంత్ర సమరయోధుడు, బీసీల ఆత్మగౌరవం

- సర్దార్ సందిరి బాలయ్య గంగపుత్ర

- ఒక చేత్తో అక్షరం.. మరో చేత్తో ఆయుధంతో బీసీల తలరాతలు మార్చిన మహానేత

- దొరల దౌర్జన్యంపై తిరుగుబాటు కత్తి... అణగారిన వర్గాల అక్షర శక్తి..

- తాను సంపాదించిన ప్రతి రూపాయి బహుజన వికాసానికే వెచ్చించిన త్యాగశీలి.

- నేడు అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా స్పెషల్ స్టోరీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశ్‌ముఖ్‌లు, దొరలు, రజాకార్ల నిరంకుశ, భయానకమైన పాలన సాగించిన రోజుల్లో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత వ్యక్తిత్వం గల నాయకుడు సర్దార్ సందిరి బాలయ్య గంగపుత్ర. కేవలం గంగపుత్ర జాతిపితగానే కాకుండా, భారత స్వాతంత్ర సంగ్రామంలోనూ చురుగ్గా పాల్గొన్నాడు. నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశ యూనియన్‌లో విలీనం చేసేందుకు పోరాడిన గొప్ప సమరయోధుడిగా, సమస్త బీసీ వర్గాల విప్లవ నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు.

జననం మరియు హైదరాబాద్ ప్రస్థానం :

సందిరి బాలయ్య 1911 నవంబర్ 11న నిజాం రాజ్యంలోని కరీంనగర్ జిల్లా ఎలగందులలో జన్మించారు. జీవనోపాధి నిమిత్తం కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన ఆయన, నాంపల్లిలో తమలపాకుల వ్యాపారం చేస్తూ ఆర్థికంగా స్థిరపడ్డారు. బాలయ్యకు వివాహమైన సంతానం లేకపోవడంతో సమాజాన్నే ఆన తన సంతానంగా భావించాడు. ఫలితంగా దేశం కోసం సమాజం కోసం గంగపుత్రుల కోసమే జీవించాడు. ఓ వైపు వ్యాపారంలో రాణిస్తూనే, తన సంపాదనను, సమయాన్ని ప్రజా సంక్షేమానికి, సమాజ సేవకే పూర్తిగా అంకితం చేసిన దానకర్ణుడు.విద్యా బోధన, సామాజిక చైతన్యంనిజాం కాలంలో అణగారిన వర్గాలకు చదువుకునే అవకాశం లేని నిరంకుశ పరిస్థితుల్లో బాలయ్య తన మేధాశక్తితో విద్యా వ్యాప్తికి నడుం బిగించారు. పేదరిక నిర్మూలన, నిరక్షరాస్యత జరగాలంటే అందుకు విద్య ఒక్కటే ఆయుధమని నమ్మారు. బీసీ కులాలు, వృత్తి కులాలు ప్రగతి బాట పట్టడం కోసం హైదరాబాద్ రాష్ట్రం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా విస్తృతంగా పర్యటించారు. అలా తాను పుట్టిన బెస్త కులంలోని మత్స్యకారులతో పాటు ఇతర అణిచివేయబడుతున్న బీసీ కులాల ప్రజలకు స్వయంగా చదవడం, రాయడం నేర్పించేందుకు కృషి చేశారు. విద్య ద్వారానే సామాజిక గౌరవం లభిస్తుందని ప్రబోధిస్తూ, బలహీన వర్గాల్లో చైతన్యం నింపారు.స్వాతంత్ర పోరాటం, రజాకార్లపై తిరుగుబాటుప్రజల సంక్షేమం కోసం భారత స్వాతంత్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న బాలయ్య, నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొంది హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి జరిగిన పోరాటాల్లో కీలక నాయకుడిగా వ్యవహరించారు. నాటి పాలనలో దేశ్‌ముఖ్‌లు, దొరలు, రజాకార్లు సాగించిన 'వెట్టి చాకిరీ' (వెట్టి వ్యవస్థ), దోపిడీకి వ్యతిరేకంగా బాలయ్య వీరోచితంగా పోరాడారు. పీడిత ప్రజల పక్షాన నిలబడి, అన్యాయాలను ఎదిరిస్తూ బహుజనులకు అండగా నిలిచారు.

సంఘాల స్థాపన, బీసీల జాతి ఐక్యత :

సమాజం సంఘటితమైతేనే హక్కులు సాధించుకోవచ్చని భావించిన బాలయ్య, అష్టల్‌గంజ్‌లో గంగపుత్ర సంఘం భవనాన్ని నిర్మించారు. ఆ తర్వాత చాదర్‌ఘాట్ (చౌదాపూర్), నగర సంఘం వంటి అనేక సంస్థల ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించారు.1956లో హైదరాబాద్ (నిజాం) రాష్ట్రం, ఆంధ్ర ప్రాంతాలు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడిన సమయంలో ఆయన ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని బెస్త, గూండ్ల మరియు ఇతర 12 ఉపకులాలుగా విడిపోయి ఉన్న మత్స్యకార సమాజాన్ని ఏకం చేస్తూ 'గంగపుత్ర సంఘం' పేరుతో రిజిస్టర్ చేయించి, జాతి ఐక్యతకు బాటలు వేశారు.115వ జయంతి వేడుకలు, ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటు కోసం డిమాండ్‌జీవితాంతం దేశం కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన సర్దార్ సందిరి బాలయ్య 1967లో కన్నుమూశారు.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో గంగపుత్రులు మరియు ఇతర బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆయన 115వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాడు నిజాం, దొరలు, భూస్వామ్యుల రాచరికాన్ని ఎదిరించి, మత్స్యకారులకు ట్యాంక్‌బండ్ (హుస్సేన్ సాగర్) పరిసరాల్లో చేపలు పట్టుకునే హక్కులను సాధించిపెట్టిన ఆయన, ఆ ప్రాంతంలోనే నివసిస్తూ ప్రజల కోసం పోరాడారు.అందువల్ల, ఆయన త్యాగాలకు గుర్తుగా నగర నడిబొడ్డున ఉన్న ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సందిరి బాలయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ మరియు గంగపుత్ర, మత్స్యకార సంఘాలు ప్రభుత్వాన్ని బలంగా డిమాండ్ చేస్తున్నాయి.సకల బీసీల ఆత్మగౌరవ ప్రతీక, సబ్బండ వర్గాల విజయభావుటగా నిలిచిన బాలయ్య పేరు, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఎంతో ప్రశంసనీయం, అనుసరణీయం, ఆదర్శణీయం.

భవానీ నామస్మరణతో మార్మోగిన ఇంద్రకీలాద్రి

- వైభవంగా భవానీ మండల దీక్షలు -- 2026 ప్రారంభం - తొలిరోజే వందలాది మంది భక్తులతో కిటకిటలాడిన మహామండపం

- మల్లేశ్వరస్వామి సన్నిధిలో బిల్వార్చన, ఆకాశదీపం, సహస్ర లింగార్చనతో ఆధ్యాత్మిక శోభ



విజయవాడ(ప్రశ్న న్యూస్) వేదమంత్రాల నడుమ భవానీ నామస్మరణ.. అమ్మవారి సన్నిధిలో భక్తుల ఆధ్యాత్మిక సందడి.. దీక్షాధారుల రాకతో ఇంద్రకీలాద్రి కొండ భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో 2026 భవానీ మండల దీక్షలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

అమ్మవారి ప్రతిష్ఠాపనతో శ్రీకారం..

మహామండపం ఆరో అంతస్తులో శ్రీ భవానీ అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి దీక్షా కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధాన ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా మహామండపానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు వి. శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఉప ప్రధాన అర్చకులు నాగరాజు శాస్త్రి భక్తులకు భవానీ దీక్షా మాలాధారణ చేశారు.

తొలిరోజే పోటెత్తిన భక్తులు..

మండల దీక్షల ప్రారంభ రోజే వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి మాలాధారణ చేశారు. భవానీ దీక్షలు స్వీకరించేందుకు భక్తులు ఆసక్తి చూపడంతో మహామండపం పరిసరాలు దీక్షాధారులతో సందడిగా మారాయి. నవంబరు 20 నుంచి 24వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై భవానీ మండల దీక్షా మాలాధారణకు అవకాశం కల్పించినట్లు దేవస్థానం వైదిక కమిటీ వెల్లడించింది.

మల్లేశ్వరుడి సన్నిధిలో కార్తీక వైభవం..

మరోవైపు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. బిల్వార్చన, ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.స్థానాచార్యులు వి. శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజా క్రతువులు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు పద్మావతి ఠాకూర్, సరిత తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆధ్యాత్మిక శోభతో ఇంద్రకీలాద్రి..

ఒకవైపు భవానీ మండల దీక్షల ప్రారంభం.. మరోవైపు కార్తీక మాస విశేష పూజలతో ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి భక్తులు, శివభక్తుల రాకతో ఆలయ పరిసరాలు భక్తి భావంతో పులకించిపోయాయి.ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు బి. ధర్మారావు, ఉప ప్రధాన అర్చకులు కోట రవికుమార్, సహాయ కార్యనిర్వహణాధికారి ఎన్. రమేష్ బాబు, కె. గంగాధర్, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కా ముత్యాల నాయుడు మృతి.. సీఎం చంద్రబాబు తీవ్ర సంతాపం

- విశాఖ మేయర్ ముక్కా శ్రావణికి ఫోన్ చేసి పరామర్శ.



అమరావతి(ప్రశ్న న్యూస్) టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖపట్నం మేయర్ ముక్కా శ్రావణి తండ్రి ముక్కా ముత్యాల నాయుడు గుండెపోటుతో మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.ముత్యాల నాయుడు మరణవార్త తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. మేయర్ ముక్కా శ్రావణికి ఫోన్ చేసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణి కుటుంబ సభ్యులతోనూ మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు.కార్పొరేటర్‌గా ముత్యాల నాయుడు విశాఖ ప్రజలకు, తెలుగుదేశం పార్టీకి అందించిన సేవలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.ముత్యాల నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జడ్పీ పీఠాలపై జనసేన గురి..
నాలుగు జిల్లాల్లో మహిళలకు పట్టం

- అభ్యర్థులతో ఎమ్మెల్సీ నాగబాబు భేటీ.. - సమన్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల్లో పట్టు బిగించడమే లక్ష్యంగా జనసేన పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కూటమిలో భాగంగా దక్కిన జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులతో పాటు ఐదు జిల్లాల వైస్ ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. మరోవైపు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ కూటమి విజయమే లక్ష్యంగా పార్టీ ముఖ్య నాయకత్వం రంగంలోకి దిగింది.

నాలుగు జిల్లాల్లో జడ్పీ ఛైర్మన్ అభ్యర్థులు..

కూటమి ఒప్పందంలో భాగంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులను జనసేన దక్కించుకుంది. ఆయా స్థానాలకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అభ్యర్థులను ఖరారు చేశారు.

- శ్రీకాకుళం కొరికాన భవాని (ఎల్.ఎన్.పేట జడ్పీటీసీ)
- పార్వతీపురం మన్యం: నిమ్మల నీలిమ (భామిని జడ్పీటీసీ
- అనకాపల్లి: మోటూరు నాగమణి (పరవాడ జడ్పీటీసీ)
- కాకినాడ: బుర్రా దివ్య సునీత రాజ్ (పెద్దాపురం)

ఐదు జిల్లాలకు వైస్ ఛైర్మన్ అభ్యర్థులు

జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ పదవులకు కూడా జనసేన అభ్యర్థులను ప్రకటించింది.

- తూర్పు గోదావరి: పల్నాటి రజని (నిడదవోలు)
- డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ: ఎలిశెట్టి రామకృష్ణ (కొత్తపేట)

బాపట్ల: కలవకూరి పిచ్చమ్మ (పర్చూరు)

- ప్రకాశం: వరికూటి లక్ష్మీ తాయారు (దర్శి)
- శ్రీ సత్యసాయి: దాసరి సునేత్ర (గోరంట్ల)

తాడేపల్లిగూడెంపై నాగబాబు ప్రత్యేక దృష్టి

ఇదిలా ఉండగా తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి, కౌన్సిలర్ అభ్యర్థులతో సమావేశమైన ఆయన ఎన్నికల కార్యాచరణ, ప్రచార ప్రణాళికలు, క్షేత్రస్థాయి వ్యూహాలపై చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల తొలి విడతలో సాధించిన విజయాల స్ఫూర్తితో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలోనూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పరస్పర సహకారం, సమన్వయంతో పక్కా ప్రణాళిక ప్రకారం ఎన్నికల కార్యాచరణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అభినందనలు..

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులుగా, ఎంపీపీలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనూ నాగబాబు ఆత్మీయంగా సమావేశమయ్యారు. ప్రజల మద్దతుతో పదవులు పొందిన వారు వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.ం

మొత్తానికి జిల్లా పరిషత్ పీఠాల కేటాయింపుల నుంచి మున్సిపల్ ఎన్నికల ప్రచారం వరకు జనసేన పార్టీ తన రాజకీయ కార్యాచరణను వేగవంతం చేస్తోంది. కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయి నాయకుల ఐక్యతే రానున్న స్థానిక ఎన్నికల్లో విజయానికి కీలకమని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

అభివృద్ధే అజెండా.. గెలుపే లక్ష్యం

- కార్పొరేషన్ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధిస్తాం: ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్) గ్రేటర్ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వేళ కూటమి అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. అభివృద్ధి పనులే ప్రధాన అజెండాగా ప్రజల్లోకి వెళ్తున్న కూటమి నేతలు.. గత పాలకుల హయాంలో పరిష్కారానికి నోచుకోని సమస్యలకు తమ ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శుక్రవారం పాత డివిజన్లు 1, 48, 49, 50 (కొత్త డివిజన్లు 2, 70, 72, 71)లో విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కూటమి మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవి, ఆయా డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు కడలి రుక్మిణి, అక్కిరెడ్డి మాధవిలతశ్రీ, కర్రి ఇందిర, గుత్తుల సత్యనారాయణలతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.సుమారు 80 వేల మంది నివసిస్తున్న క్వారీ ప్రాంతంలో ప్రస్తుతం ఉదయం, సాయంత్రం వేళల్లో కూడా అరగంటకు మించి నీటి సరఫరా జరగడం లేదని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న మూడు, నాలుగు నెలల్లో ఉదయం, సాయంత్రం కనీసం గంట చొప్పున నీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

కోడ్ ముగియగానే కొత్త పింఛన్ల పంపిణీ..

అర్హులైన పలువురికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో వాటిని పంపిణీ చేయలేకపోతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. నగరంలో అభివృద్ధి పనులను నిరంతరాయంగా కొనసాగించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులందరికీ ప్రజల మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వానికి ఎన్నికల్లో అండగా నిలవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజలను కోరారు.?

ఏలూరు జడ్పీ పీఠంపై చింతమనేని సాయి నవ్యశ్రీ

- వైస్ చైర్మన్‌గా చలమయ్య బొర్రా ఎన్నిక..- అభినందనలు తెలిపిన ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్



ఏలూరు (ప్రశ్న న్యూస్) ఏలూరు జిల్లా పరిషత్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా చింతమనేని సాయి నవ్యశ్రీ, వైస్ చైర్‌పర్సన్‌గా చలమయ్య బొర్రా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో వీరి ఎన్నిక పూర్తయింది. మరో ప్రతిపాదన లేకపోవడంతో ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. దీంతో ఏలూరు జిల్లా పరిషత్‌కు నూతన నాయకత్వం కొలువుదీరింది.

ముందుగా 27 మంది జడ్పీటీసీల ప్రమాణ స్వీకారం..

ఎన్నికల ప్రక్రియలో భాగంగా తొలుత జిల్లాలోని 27 మంది జడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నిక నిర్వహించారు. పెదవేగి మండల జడ్పీటీసీ చింతమనేని సాయి నవ్యశ్రీ పేరును ద్వారకా తిరుమల జడ్పీటీసీ సత్య శ్రావణి కరుటూరి ప్రతిపాదించగా, కామవరపుకోట జడ్పీటీసీ జాహ్నవి మందలపు బలపరిచారు. చైర్‌పర్సన్ పదవికి మరొక ప్రతిపాదన రాకపోవడంతో సాయి నవ్యశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు.

వైస్ చైర్మన్‌గా చలమయ్య బొర్రా..

జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పదవికి ముదినేపల్లి మండల జడ్పీటీసీ చలమయ్య బొర్రా పేరును జంగారెడ్డిగూడెం మండల జడ్పీటీసీ గొల్లమండల సంకీర్తన ప్రతిపాదించగా, టి. నర్సాపురం జడ్పీటీసీ కూరపాటి సుజాత బలపరిచారు. ఈ పదవికి కూడా మరో ప్రతిపాదన లేకపోవడంతో చలమయ్య బొర్రా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌కు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అందజేశారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన చింతమనేని సాయి నవ్యశ్రీకి శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, డాక్టర్ కామినేని శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

జల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం


నల్లగొండ : పల్నాడు వాటర్ గ్రిడ్ పేరుతో నాగార్జునసాగర్ విజయపురి వద్ద, పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న జలాల తరలింపు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. ఈ అంశంపై ఆయన నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. తాగునీటి అవసరాల పేరుతో జలదోపిడీకి తెరలేపుతూ రహస్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. గత ఎనిమిది నెలలుగా ఈ పనులు జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం, విషయం తెలిసిన తర్వాత కూడా కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు నిద్రమత్తులో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఈ జలదోపిడీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కృష్ణా నదీ జలాల విషయంలో విభజన చట్టాన్ని అమలు చేసి తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను తేల్చాలని కోరారు. తెలంగాణకు చెందిన బీజేపీ మంత్రులు, ఎంపీలు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల' నినాదంతో సాధించుకున్న తెలంగాణలో జలదోపిడీని సహించేది లేదని, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎనిమిది నెలలుగా పనులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వీర్లపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులను అరెస్టు చేసి, పోలీసు బందోబస్తు మధ్య కార్యక్రమాన్ని నిర్వహించడం అమానుషమని మండిపడ్డారు. గిరిజన, దళిత వర్గాలు నివసించే ప్రాంతాల సమీపంలో కాలుష్యకారక పరిశ్రమలను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు. వీర్లపాలెంలో ఇథనాల్ పేరుతో నిర్మిస్తున్న పరిశ్రమను వెంటనే నిలిపివేసి, ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

‘ఓం’ - మూవీ రివ్యూ!



ధనుష్ .. శ్రీలీల .. మమ్ముట్టి .. సాయిపల్లవి .. నసీరుద్దీన్ షా .. ఇది ఒక డిఫరెంట్ కాంబినేషన్. అలాంటి ఈ కాంబినేషన్లో రూపొందిన సినిమానే గా.వీ (ఆపరేషన్ మోల్). పోస్టర్స్ .. ట్రైలర్ చూసినవాళ్లందరికీ కథ కాస్త అర్థమైనప్పటికీ కాంబినేషన్ కొత్తగా అనిపించింది. ఒక సోల్జర్ నేపథ్యంలో ‘అమరన్’ ను తెరకెక్కించి మంచి మార్కులు కొట్టేసిన రాజ్ కుమార్ పెరియస్వామి, ఈ సారి అందుకు పూర్తి భిన్నమైన కథను ఎంచుకున్నాడు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఆయన రూపొందించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. చిత్తూరు జిల్లా నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ జోరుగా కొనసాగుతూ ఉంటుంది. ఇక్కడి నుంచి దుబాయ్ కీ .. అక్కడి నుంచి జపాన్ .. హాంకాంగ్ కు ఎర్రచందనం తరలించబడుతూ ఉంటుంది. చెన్నైకి చెందిన కార్తికేయన్ (మమ్ముట్టి) ఈ మొత్తం వ్యవహారంలో చక్రం తిప్పుతుంటాడు. దుబాయ్ లో ఉంటూ ఈ మాఫియా మొత్తానికి నాయకుడిగా వ్యవహరిస్తూ ఉంటాడు అబ్దుల్ హమీద్ (నసీరుద్దీన్ షా). ఎర్రచందనం చెట్లు నరికే కూలీలుగా తమిళనాడులోని ‘జవ్వాది మలై’కి చెందిన గూడెం ప్రజలు పనిచేస్తుంటారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారిణిగా నిత్యారెడ్డి (సాయి పల్లవి) ఉంటుంది. ఫారెస్ట్ ఆఫీసర్ గా ఉన్న ఆమె తండ్రి .. పోలీస్ ఆఫీసర్ గా ఉన్న ఆమె భర్త కూడా ఎర్రచందనం మాఫియాకి బలైపోతారు. అందువలన ఆమె ఈ మాఫియా వెనుక ఎవరు ఉన్నది తెలుసుకుని వాళ్లకి శిక్ష పడేలా చేయాలనుకుంటుంది. అలా ఆమె ఆదేశం మేరకు అండర్ కవర్ ఆఫీసర్ గా చెన్నైకి వెళ్లిన ‘పళని’ (ధనుష్) తన పేరును ‘తిరు’గా మార్చుకుని, కార్తికేయన్ క్యాంప్ లో అడుగుపెడతాడు. చాలా తక్కువ సమయంలోనే ఆయన నమ్మకాన్ని సంపాదిస్తాడు. ‘పళని’ భార్య ‘రోజా’(శ్రీలీల). ఈ ఇద్దరికీ ఒక కొడుకు ఉంటాడు. ‘పళని’ తండ్రి షణ్ముగం (ఇంద్రన్స్) కూడా వాళ్లతోనే కలిసుంటాడు. అయితే వీళ్లెవరికీ పళని ఏం చేస్తున్నది తెలియదు. కార్తికేయన్ స్థావరాలు .. ఎర్రచందనం దాచిన ప్రదేశాలను గురించి ‘తిరు’ తెలుసుకుంటాడు. ఆ ఎర్రచందనం బయటికి వచ్చేలా చేస్తేనే, మాఫియా నాయకుల కదలికలు తెలుస్తాయని నిత్యారెడ్డి భావిస్తుంది. అలా ఆమె ‘తిరు’ ద్వారా 700 టన్నుల లోడ్ ను రోడ్డెక్కించగలుగుతుంది. ఆమె వ్యూహం ఫలిస్తుందా? ఎర్రచందనం మాఫియాను అడ్డుకోగలుగుతుందా? ఈ మొత్తం ఆపరేషన్ లో ‘తిరు’కి ఎదురయ్యే సవాళ్లు ఎలాంటివి? అనేదే మిగతా కథ. తన తండ్రినీ .. భర్తను పొట్టనబెట్టుకున్న ఎర్రచందనం మాఫియాను కట్టడి చేయాలని టాస్క్ ఫోర్స్ ఆఫీసర్ నిత్యారెడ్డి రంగంలోకి దిగుతుంది. ఆమె ఆదేశాలను ఆచరణలో పెట్టడం కోసం అండర్ కవర్ ఆఫీసర్ గా ‘తిరు’ బరిలోకి దిగుతాడు. ఈ ఇద్దరూ కలిసి ఈ మాఫియా నాయకులను ఎలా ఎదిరించారు? అందుకోసం ఎలాంటి సాహసాలు చేశారు? ఎటువంటి త్యాగాలు చేశారు? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో గతంలో చాలానే కథలు తెరపైకి వచ్చాయి. ఇటు సిన్సియర్ పోలీస్ అధికారులు .. అటు మాఫియా ముఠా నాయకుల మధ్యనే ఈ తరహా కథలు నడిచేవి. అయితే ఈ మధ్యలో నలిగిపోయే కూలీలు .. చితికిపోయే వారి కుటుంబాలను టచ్ చేయడం, ఈ కథలోని కొత్త అంశంగా అనిపిస్తుంది. మాఫియాకి సంబంధించిన లోకల్ లీడర్లను పట్టుకోవడానికే పరిమితం కాకూడదు. అలాగే కూలీల కుటుంబాలకు వేరే ఉపాధి మార్గాలు చూపించాలనే ఒక కొత్త పాయింట్ దిశగా దర్శకుడు ఈ కథను తీసుకెళ్లాడు. కార్తికేయన్ కి అనుమానం రాకుండా ‘తిరు’ తన ప్లాన్ ను ఎగ్జిక్యూట్ చేసే సన్నివేశాలు .. కార్తికేయన్ ముఠాను పోలీస్ ఫోర్స్ చుట్టముట్టడం .. కూలీలను ఎన్ కౌంటర్ చేయకుండా ‘తిరు’ అడ్డుకోవడం .. ప్రీ క్లైమాక్స్ లో కోర్టు సీన్ .. ఇంటర్వెల్ కి ముందొచ్చే ఇంద్రన్స్ సీన్ ఈ సినిమా హైలైట్స్ లో చోటు సంపాదించుకుంటాయి. ఇక ఇటు తిరుపతి నేపథ్యం .. అటు అరుణాచలం నేపథ్యం తీసుకోవడం మరో ప్రత్యేక ఆకర్షణగా చెప్పుకోవాలి. దర్శకుడు కథను కదిలించిన తరువాత ఎక్కువ సమయం తీసుకోకుండానే ముందుగా సాయిపల్లవి పాత్రను .. ఆ తరువాత ధనుష్ పాత్రలను పరిచయం చేశాడు. ఆరంభం సన్నివేశాలు మాత్రం ఒక 15 నిమిషాలు పాటు గోలగోలగా సాగుతూ గుండె దడ తెప్పిస్తాయి. ఆ తరువాత కాస్త సాదాసీదాగా అనిపించే సన్నివేశాలతోనే కథ నడక సాగుతూ ఉన్నప్పటికీ, ఇంటర్వెల్ కి ముందు ‘తిరు’ తండ్రి కాల్ చేసిన దగ్గర నుంచే కథ పుంజుకుంటుంది.ధనుష్ పాత్రను .. సాయిపల్లవి పాత్రను డిజైన్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. తెరపై ఈ రెండు పాత్రలు చాలా బలంగా కనిపిస్తాయి. ఆ పాత్రలలో ఇద్దరూ ఒదిగిపోయారు. ఇక తాను చేసేది స్మగ్లింగ్ అయినప్పటికీ మానవత్వం .. నిజాయితీ ఉన్న వ్యక్తిగా మమ్ముట్టి నటన కూడా ఆకట్టుకుంటుంది. న్యాయం చేయకపోయినా ఫరవాలేదు .. ద్రోహం చేయకూడదు అనే ఆయన కాన్సెప్ట్ కదిలించివేస్తుంది. ఇక ధనుష్ భార్యగా శ్రీలీల లుక్ కొత్తగా అనిపిస్తుంది. నసీరుద్దీన్ షా పాత్ర నామ మాత్రం అన్నట్టుగా చూపించారు. అరసు ఫొటోగ్రఫీ బాగుంది. అడవి నేపథ్యంలో సన్నివేశాలను .. తిరుమల .. అరుణాచలం కొండలను కవర్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది. సాయి అభయంకర్ నేపథ్య సంగీతం, అక్కడక్కడా సన్నివేశాలను నిలబెట్టేసింది. మరికొన్ని చోట్ల మాత్రం హోరెత్తించింది. ధనుష్ గ్రూప్ సాంగ్ సాహిత్యం మనకు వినిపించదు. కలైవానన్ ఎడిటింగ్ విషయానికి వస్తే, ఆరంభ సన్నివేశాలను .. క్లైమాక్స్ లో జైలులో ఫైట్ సీన్స్ ను ట్రిమ్ చేయవచ్చు. ఇక అక్కడక్కడ కూడా కత్తెరకు గట్టిగానే పని పడుతుంది. యాక్షన్ .. ఎమోషన్స్ తో కూడిన కథ ఇది. కథలో కొత్త పాయింట్ కూడా ఉంది. కాకపోతే అసలు కథలోకి వెళ్లడానికి తీసుకున్న సమయం ఎక్కువగా ఉండటం, డీటేల్డ్ గా చెప్పాలనే ఉద్దేశంతో సాగదీయడం ప్రధానమైన లోపంగా కనిపిస్తుంది. స్క్రీన్ ప్లే పై ఇంకాస్త కసరత్తు చేసుంటే, మరింత బెటర్ అవుట్ పుట్ వచ్చేదేమో అనిపిస్తుంది.

1500కోట్ల క్లబ్‌లో‘రామాయణ’



రణ్‌బీర్‌కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన పౌరాణిక ఇతిహాసం ‘రామాయణ’ ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీని సృష్టిస్తున్నది. కేవలం 14రోజుల్లోనే వరల్డ్‌వైడ్‌గా 1500కోట్ల వసూళ్ల మైలురాయిని దాటింది. అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన భారతీయ చిత్రంగా సరికొత్త రికార్డు సృష్టించింది. భారతీయ మార్కెట్‌తో పాటు విదేశాల్లో కూడా ఈ సినిమా ప్రభంజనాన్ని సృష్టిస్తున్నది. నితేశ్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మించారు. దాదాపు 4000కోట్లతో రెండు భాగాలుగా ఈ సినిమాను తెరకెక్కించారు. దేశీయ బాక్సాఫీస్ వద్ద వెయ్యికోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన ఆరో చిత్రంగా ‘రామాయణ’ నిలిచింది. అంతకుముందు బాహుబలి-2, కేజీఎఫ్-2, పుష్ప-2, ధురంధర్, ధురంధర్-2 చిత్రాలు ఈ రికార్డును అందుకున్నాయి. రణబీర్‌కపూర్, సాయిపల్లవి కెరీర్‌లో కూడా వెయ్యికోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన తొలి చిత్రమిదే కావడం విశేషం. భారతీయ బాక్సాఫీస్ వద్ద రెండో వారాంతంలో కూడా 196కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. ఇక దక్షిణాదిలో కూడా ఒక్కో రాష్ట్రం నుంచి 50కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా ‘రామాయణ’ రికార్డు సృష్టించింది. గతంలో జవాన్, యానిమల్, ధురంధర్-2 వంటి చిత్రాలు దక్షిణాదిలో మంచి వసూళ్లు సాధించినప్పటికీ, ఈ స్థాయిలో భారీ కలెక్షన్స్‌ను రాబట్టలేకపోయాయి.

29 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన వందేమాతరం

- సుద్దాల.. ‘మైసా’ నుంచి పవర్‌ఫుల్ విప్లవ గీతం నేడే!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘మైసా’ నుంచి సినీ అభిమానులను ఆకట్టుకునే క్రేజీ అప్‌డేట్ వెలువడింది. తెలుగు సినీ సంగీత, సాహిత్య రంగాల్లో తమదైన ముద్ర వేసిన దిగ్గజ జోడీ వందేమాతరం శ్రీనివాస్, సుద్దాల అశోక్ తేజ దాదాపు 29 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ సినిమా కోసం మరోసారి చేతులు కలపడం విశేషంగా మారింది. ఎన్నో మరపురాని గీతాలను అందించిన వీరిద్దరి కలయిక మరోసారి తెరపైకి వస్తుండటంతో సంగీత ప్రియులు, సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న ఓ పవర్‌ఫుల్ విప్లవ గీతాన్ని నేడు (నవంబర్ 20) మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని ఏఏఏ సినిమాస్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేయనున్నారు. కథా నేపథ్యానికి తగ్గట్టుగా ఈ విప్లవ గీతం శక్తిమంతమైన సాహిత్యం, భావోద్వేగాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. విడుదల వేడుకతో సినిమా ప్రమోషన్లలో మరింత వేగం పెరగనుంది. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. రష్మిక మందన్న గతంలో ఎన్నడూ కనిపించని శక్తివంతమైన, భిన్నమైన పాత్రలో కనిపిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలతో ‘మైసా’పై మంచి అంచనాలు ఏర్పడగా, ఈ సినిమా నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

టైసన్‌నాయుడు స్పాట్ జడ్జిమెంట్



బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘టైసన్ నాయుడు’. నేహా శెట్టి కథానాయిక. సాగర్‌చంద్ర దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. ఇప్పటికే విడుదలైన ప్రచారచిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయని వారు ఆనందం వెలిబుచ్చారు. తాజాగా గురువారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఇక టీజర్ ఎలా ఉందో గమనిస్తే.. ‘పోలీస్ డిపార్ట్‌మెంట్ ‘స్పెషల్ ఆపరేషన్స్ టీమ్’ పేరిట ఓ ప్రత్యేకమైన ఫాంటమ్ వింగ్‌ను ఏర్పాటు చేస్తుంది. రూల్స్ బ్రేక్ చేస్తూ స్పాట్‌లోనే శిక్షించడం ఈ వింగ్ స్పెషాలిటీ. మరోవైపు వరుసగా జరుగుతున్న నేరాలు. ఆందోళనకు గురి అవుతున్న ప్రజలు. వాటి వెనుక ఉన్న భారీ కుట్రను హీరో గుర్తించడం.. ఈ నేపథ్యం ఆద్యంతం ఆసక్తికరంగా టీజర్ సాగింది. ఇంటెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు సాగర్ కె.చంద్ర తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ స్పెషల్ ఆఫీసర్‌గా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ప్రగ్యా జైస్వాల్, నరేష్, సునిల్, రావురమేశ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అనీత్, ముకేష్ జ్ఞానేష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణం: 14 రీల్స్ ప్లస్.

ఆ తప్పనేనెప్పటికీచేయను



‘అక్క’ వెబ్ సిరీస్ ప్రమోషన్‌లో భాగంగా దక్షిణాది సంప్రదాయంపై, అలాగే దక్షిణాదికి చెందిన ఓ అగ్ర హీరో సినిమాపై రాధికా ఆప్టే చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేకెత్తించాయి. ఆ సమయంలో ఆమె పక్కనే కీర్తి సురేశ్ కూడా ఉండటం, నవ్వుతూ ఆమె మాటలు వినడం కూడా విమర్శలకు కారణమైంది. దీనిపై తాజాగా కీర్తి సురేశ్ స్పందించారు. తన తాజా సినిమా ‘సత్యవాన్ సావిత్రి’ సినిమా ప్రమోషన్‌లో భాగంగా రాధిక ఆప్టే మాటలను ఆమె ప్రస్తావిస్తూ ‘సినిమాలో మేనమామతో పెళ్లి గురించి రాధిక ఆప్టే ఏ ఉద్దేశంతో మాట్లాడారో అప్పుడు నాకర్థం కాలేదు. ఆమె మన దక్షిణాది సాంప్రదాయం గురించి మాట్లాడుతున్నదని ఆ తర్వాత అర్థమైంది. ఉత్తరాది వాళ్లకు మన సాంప్రదాయాల గురించి తెలియకపోవచ్చు. నావరకూ నేను మన సంస్కృతిని ఎప్పటికీ తక్కువ చేసి మాట్లాడను’ అంటూ వివరణ ఇచ్చారు కీర్తి సురేశ్.

రామ్ నితిన్ ద్విభాషా చిత్రం



మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు యువహీరో రామ్ నితిన్. గురువారం ఆయన కొత్త చిత్రం తాలూకు ప్రకటన వెలువడింది. ప్రేమకథగా తెరకెక్కనున్న ఈ చిత్రం ద్వారా కార్తిక్ జై పళని దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రథానా నాథన్, తేజు అశ్విని కథానాయికలుగా నటిస్తున్నారు. సోల్జర్స్ ఫ్యాక్టరీ, రెడాక్టెడ్ స్టూడియోస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో ద్విభాషా చిత్రంగా తెరకెక్కించబోతున్నారు. విభిన్న ప్రేమ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, టైటిల్‌తో పాటు ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.

రొటర్‌డ్యామ్ ఫిలిం ఫెస్టివల్ ఎంపికైన ‘డోరతీ’.. లైమ్‌లైట్ విభాగంలో ప్రదర్శన!

ప్రతిష్టాత్మక రొటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ (IFFR) లోని లైమ్‌లైట్ విభాగానికి తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన ‘డోరతీ’ (Dorothy) చిత్రం ఎంపికైంది. ప్రపంచ సినిమా రంగంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న IFFR వేదికపై ఈ సినిమా స్థానం సంపాదించడం చిత్రబృందానికి, సినీ అభిమానులకు సంతోషాన్ని కలిగించింది. లైమ్‌లైట్ విభాగంలో ప్రదర్శితమయ్యే చిత్రాలు అంతర్జాతీయ ప్రేక్షకులు, ఫిలిం మేకర్లు, విమర్శకుల దృష్టిని ఆకర్షిస్తుండటంతో ‘డోరతీ’కి ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తోంది.కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కీర్తి సురేష్, సనంతో, రిషికాంత్ ముఖ్య పాత్రలలో కనిపించారు. సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్, జియో స్టూడియోస్, ధమ్మమ్ ఫిల్మ్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు సంగీత మాంత్రికుడు ఇళయరాజా స్వరాలు సమకూర్చారు. బలమైన కథనం, విభిన్నమైన ప్రెజెంటేషన్, ప్రముఖ సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్, ప్రారంభం నుంచే సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుకుంది.గతంలో టొరంటో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ వేదికగా ప్రీమియర్ ప్రదర్శనలు జరిపి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన ‘డోరతీ’, సెప్టెంబర్‌లో థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేట్రికల్ రిలీజ్ తర్వాత కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ ఫిలిం ఫెస్టివల్స్‌లో తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, ఇప్పుడు IFFR లైమ్‌లైట్ విభాగంలో చోటు దక్కించుకోవడం ఈ చిత్రానికి లభించిన మరో పెద్ద విజయంగా విశ్లేషకులు భావిస్తున్నారు.



లాడ్జిలో గది అడిగినందుకు దాడి..

- వ్యక్తి మృతి కేసులో ఇద్దరి అరెస్ట్

- లాడ్జి యజమాని, బాయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు



భద్రాచలం(ప్రశ్న న్యూస్) భద్రాచలం పట్టణంలో లాడ్జిలో గది కావాలని అడిగిన వ్యక్తులపై దాడికి పాల్పడి, తెల్లం శరత్ బాబు మృతికి కారణమైన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16వ తేదీన తెల్లం శరత్ బాబు వద్దకు అతని స్నేహితులు, బంధువులైన కుర్సం నాగప్రశాంత్, కీసర కార్తీక్‌లు కలిసేందుకు భద్రాచలం వచ్చారు. రాత్రి బస చేసేందుకు గది కోసం వెతుకుతూ రామాలయం సమీపంలోని సత్యసాయి లాడ్జికి రాత్రి 10 గంటల సమయంలో వెళ్లి గది కావాలని అడిగారు.ఈ క్రమంలో గది కేటాయింపు విషయంలో లాడ్జి యజమాని ద్వార మణికంఠ, లాడ్జి బాయ్ బర్ల వినయ్‌లకు ముగ్గురితో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో ఇద్దరు నిందితులు వారిపై దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో తెల్లం శరత్ బాబు తీవ్రంగా గాయపడి రోడ్డుపై స్పృహ కోల్పోయి పడిపోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనపై మృతుడి తండ్రి తెల్లం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితులైన ద్వార మణికంఠ, బర్ల వినయ్‌లను నవంబర్ 20న పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.భద్రాచలం పట్టణ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

తీర గ్రామాలకు తుఫాను షెల్టర్లు

- కృష్ణా జిల్లా అభివృద్ధికి భోగాది రమాదేవి ప్రత్యేక కార్యాచరణ



మచిలీపట్నం(ప్రశ్న న్యూస్) ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కృష్ణా జిల్లా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని నూతన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ భోగాది రమాదేవి స్పష్టం చేశారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రకటించారు. తుపాన్లు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణ కల్పించేందుకు ప్రతి తీర గ్రామంలో తుఫాను షెల్టర్లు ఏర్పాటు చేయడం, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం తమ ప్రాధాన్యతలని వెల్లడించారు.శుక్రవారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో తన చాంబర్‌లో భోగాది రమాదేవి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం..

బాధ్యతల స్వీకరణ అనంతరం రమాదేవి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజలు అభివృద్ధికి మద్దతుగా తీర్పునిచ్చారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా పరిషత్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. విధ్వంసానికి తావులేకుండా అభివృద్ధి దిశగా పనిచేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. అంత్యోదయ స్ఫూర్తితో సమాజంలోని అట్టడుగు వర్గాలకు, చివరి వ్యక్తి వరకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, రహదారి కనెక్టివిటీ, భద్రత, ప్రశాంత వాతావరణం కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

తుఫాన్ల సమయంలో ప్రజలకు భరోసా..

కృష్ణా జిల్లాకు విస్తారమైన సముద్ర తీరం ఉన్నందున తీర ప్రాంత గ్రామాలు ప్రకృతి విపత్తుల సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. తుపాన్లు, భారీ వర్షాలు వచ్చినప్పుడు అనేక గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాల కోసం దూర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రతి తీర గ్రామంలో తుఫాను షెల్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

శ్రీవారి ఆశీస్సులతో నెల్లూరు అభివృద్ధికి కొత్త అధ్యాయం

- మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో తిరుమల యాత్ర



తిరుమల (ప్రశ్న న్యూస్) నెల్లూరు నగర పాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టనున్న కార్పొరేషన్ నూతన విజేతలు ఆధ్యాత్మిక వాతావరణంలో తమ బాధ్యతల స్వీకరణకు సిద్ధమయ్యారు. ప్రజాప్రతినిధులుగా కొత్త బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో విజేతల బృందం శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంది. ప్రమాణ స్వీకారానికి ముందుగా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి ఆశీస్సులు పొందడం ద్వారా తమ నూతన ప్రస్థానాన్ని ప్రారంభించింది. వచ్చే సోమవారం జరగనున్న నెల్లూరు కార్పొరేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు ఈ ప్రత్యేక దర్శనం నిర్వహించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేషన్ ప్రతినిధులంతా మంత్రి నారాయణతో కలిసి తిరుమలకు చేరుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. శ్రీవారి దర్శనంతో నూతన బాధ్యతలు చేపట్టనున్న ప్రజాప్రతినిధుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది.

ప్రజాసేవకు దైవబలం.. అభివృద్ధికి సంకల్పం..

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, నగరాభివృద్ధికి సమష్టిగా కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని విజేతలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు స్వీకరించనున్న తరుణంలో శ్రీవారి దర్శనం తమకు ప్రత్యేకమైన అనుభూతిని అందించిందని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజా సేవలో మరింత అంకితభావంతో పనిచేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.నెల్లూరు నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై దృష్టి సారించాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉంది. నగర ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని విజేతలు సంకల్పించినట్లు తెలిపారు.

విచారణ పేరుతో మహిళా ఉద్యోగులకు వేధింపులా

- 321 మందికి ఒకేసారి విచారణ.. ఆరు గంటల పాటు నరకయాతన - కనీసం కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్ల వసతి కరువు

- సంబంధం లేని వారిని ఎందుకు పిలిచారు.. - సంతకాలు పెట్టాల్సిందేనంటూ అధికారుల హుకుం.. అస్వస్థతకు గురైన ఉద్యోగులు





గుంటూరు(ప్రశ్న న్యూస్) మహిళా శిశు సంక్షేమ శాఖలో విచారణ పేరుతో మహిళా ఉద్యోగులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారా? తప్పు చేసిన వారిని గుర్తించి విచారించాల్సిన అధికారులు.. సంబంధం లేని వందలాది మంది అంగన్‌వాడీ ఉద్యోగులను ఒకేసారి కార్యాలయానికి పిలిపించి ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. గతంలో యూడీసీగా పనిచేసిన ఓ ఉద్యోగికి సంబంధించిన విచారణ పేరుతో గుంటూరు అర్బన్ పరిధిలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలను శుక్రవారం ప్రాజెక్టు కార్యాలయానికి పిలిపించినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సాగిన ఈ ప్రక్రియలో కనీస సౌకర్యాలు కల్పించలేదని, అధికారుల తీరుతో కొందరు అస్వస్థతకు గురై కళ్లుతిరిగి పడిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తు సమాచారం లేకుండానే పిలుపు..

శుక్రవారం సమావేశం ఉందంటూ సెక్టార్ సూపర్‌వైజర్ల ద్వారా ఉద్యోగులకు సమాచారం పంపించారు. ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్న కొంతమంది సీడీపీఓలు ఏ విషయంపై సమావేశం నిర్వహిస్తున్నారని ప్రాజెక్టు అధికారిని ప్రశ్నించగా, గతంలో యూడీసీగా పనిచేసిన వ్యక్తికి సంబంధించిన విచారణ అని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అయితే ముందస్తుగా సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించగా, ఉదయం 11.30 గంటలకు సెక్టార్ గ్రూపుల్లో విచారణకు సంబంధించిన లేఖను సూపర్‌వైజర్ల ద్వారా పంపినట్లు చెప్పారని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

విచారణ ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు సమాచారం ఇచ్చినప్పటికీ, విచారణ అధికారులు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకున్నారని, అసలు విచారణ మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీంతో ఉదయం నుంచి కార్యాలయంలోనే పడిగాపులు కాయాల్సి వచ్చిందని వాపోతున్నారు.

321 మంది.. ఒకే చోట విచారణ..

సుమారు 321 మంది విచారణకు హాజరవుతారని తెలిసినా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం కూర్చోవడానికి కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. చేసేదేమీ లేక కొందరు నేలపైనే కూర్చోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విచారణ పేరుతో కార్యాలయంలోనే ఉంచడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంబంధం లేని వారిని ఎందుకు పిలిచారు..

గతంలో యూడీసీగా పనిచేసిన వ్యక్తికి సంబంధించిన ఫిర్యాదు, విచారణలో తమకు ఎలాంటి సంబంధం లేదని కొంతమంది ఉద్యోగులు అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. ఫిర్యాదు చేసిన వారిని, సంబంధిత వ్యక్తులను విడివిడిగా విచారించకుండా మొత్తం సెక్టార్‌కు చెందిన ఉద్యోగులందరినీ ఎందుకు పిలిచారని నిలదీసినట్లు తెలిసింది. అయితే అందరూ హాజరై సంతకాలు పెట్టి వెళ్లాల్సిందేనంటూ అధికారులు ఒత్తిడి తెచ్చారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.అనారోగ్యంతో ఉన్నవారు, విచారణతో సంబంధం లేదని చెప్పినవారు, ఎన్నికల విధులకు వెళ్లాల్సి ఉందని విజ్ఞప్తి చేసినవారి మాటలను కూడా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఈ నెల 18వ తేదీన ఎన్నికల విధులకు హాజరు కావాల్సి ఉందని, ప్రస్తుతం విచారణకు హాజరుకావడం కష్టమని వేడుకున్నా అధికారులు సానుకూలంగా స్పందించలేదని ఆరోపిస్తున్నారు.

సంతకాలు పెట్టాల్సిందేనంటూ ఒత్తిడి..

విచారణ సందర్భంగా ఉద్యోగుల వాదనలు వ్యక్తిగతంగా వినాల్సి ఉండగా, గ్రూపుల వారీగా అందరినీ ఒకచోట కూర్చోబెట్టి విచారణ చేపట్టారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అధికారులు సిద్ధం చేసిన చెక్‌లిస్టులు, పత్రాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి తెచ్చారని, కొన్ని పత్రాల్లో అధికారులు సూచించిన విధంగానే రాయించి సంతకాలు తీసుకున్నారని చెబుతున్నారు

తమకు సంబంధం లేని అంశాలపై ఎందుకు సంతకాలు చేయాలని ప్రశ్నించిన వారిని బెదిరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'మా డ్యూటీలు మాకు తెలియదా? మీరు మాకు చెబుతారా?' అంటూ ప్రశ్నించిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారని, 'మీ సంగతి చూస్తాం.. గుర్తుపెట్టుకుంటాం' అంటూ హెచ్చరించినట్లు ఉద్యోగులు వాపోతున్నారు.

మహిళా ఉద్యోగుల ఆవేదన పట్టదా..

విచారణకు హాజరైన కొంతమంది మహిళా ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై అస్వస్థతకు లోనైనట్లు ఆరోపణలు ఉన్నాయి. కళ్లుతిరిగి పడిపోయే పరిస్థితి వచ్చినా కనీస సౌకర్యాలు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని వారికి అండగా నిలవాల్సిన ఉన్నతాధికారులే ఇలా వ్యవహరిస్తే తమకు న్యాయం చేసేదెవరని ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి..

ఈ విచారణలో పల్నాడు జిల్లా పీడీ నాగమల్లేశ్వరి, గుంటూరు జిల్లా పీడీ పీజీ ప్రసన్న విచారణ అధికారులుగా వ్యవహరించినట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. పల్నాడు పీడీ కార్యాలయానికి చెందిన మరికొందరు అధికారులు కూడా విచారణకు హాజరైనట్లు సమాచారం.గతంలోనూ విచారణల పేరుతో పలుమార్లు వివిధ కార్యాలయాలకు పిలిపించి ఇబ్బందులకు గురిచేశారని, పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారుల తీరు మారడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఇంద్రకీలాద్రిపై టికెట్ల దందా బట్టబయలు

- సీసీ కెమెరాల నిఘాలో ఉద్యోగి బాగోతం.. - ప్రింటర్ సాంకేతిక లోపాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ విక్రయాలు..

- రూ.18,600 నగదు స్వాధీనం.. పోలీసులకు ఈవో ఫిర్యాదు

విజయవాడ(ప్రశ్న న్యూస్) భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని ఇంద్రకీలాద్రిపై దర్శన టికెట్ల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడుతున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తుంటే.. కొందరు సిబ్బంది మాత్రం ఆలయ ఆదాయానికే గండి కొట్టే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సీసీ కెమెరాల నిఘాలో ఓం టర్నింగ్ టికెట్ కౌంటర్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అనుమానాస్పద వ్యవహారం బయటపడటంతో దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. రూ.18,600 నగదును స్వాధీనం చేసుకుని, ఉద్యోగిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ కెమెరాల్లో అనుమానాస్పద కదలికలు..

దేవస్థానం అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో పంచవాయిద్యకారుడిగా పనిచేస్తున్న వి. చంద్రమౌళి గత నెల రోజులుగా సిబ్బంది విధుల సర్దుబాటులో భాగంగా ఓం టర్నింగ్ వద్ద ఉన్న రూ.500, రూ.300, రూ.100 దర్శన టికెట్ల కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం (నవంబరు 19) సాయంత్రం 5.30 గంటల సమయంలో ఈవో వి.కె. శీనా నాయక్ లైవ్ సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తుండగా ఉద్యోగి కదలికలు అనుమానాస్పదంగా కనిపించాయి.వెంటనే వైర్‌లెస్ ద్వారా సమీపంలోని ప్రోటోకాల్ సిబ్బందిని అప్రమత్తం చేసి ఆకస్మిక తనిఖీలకు ఆదేశించారు. ఉద్యోగి వద్ద ఉన్న నగదు, టికెట్లను లెక్కించాలని సూచిస్తూ తనిఖీ ప్రక్రియను సీసీ కెమెరాల ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

ప్రింటర్ లోపాన్ని ఆసరాగా చేసుకుని..

తనిఖీ సమయంలో ఉద్యోగి కంప్యూటర్‌కు అడ్డుగా నిలబడి సీసీ కెమెరాలకు కనిపించకుండా నగదును జేబులో పెట్టుకుంటున్నట్లు గుర్తించినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. అతని వద్ద కౌంటర్ నగదుకు అదనంగా రూ.18,600 లభించాయి. ఇందులో రూ.500 నోట్లు 37, రూ.100 నోటు ఒకటి ఉన్నట్లు తెలిపారు.అనంతరం ఉద్యోగిని పరిపాలన భవనానికి తీసుకెళ్లి ఈవో, కార్యనిర్వాహక ఇంజినీర్, పరిపాలన విభాగ సహాయ కార్యనిర్వహణాధికారి, సూపరింటెండెంట్ సమక్షంలో విచారించారు. తన వద్ద లభించిన నగదులో రూ.10 వేలు ఇంటి నుంచి వ్యక్తిగత అవసరాల కోసం తెచ్చుకున్నానని, మిగిలిన రూ.8,600 భక్తులకు టికెట్లు జారీ చేసిన అనంతరం ప్రింటర్‌లోని సాంకేతిక లోపాన్ని దుర్వినియోగం చేసి అదనపు టికెట్లు విక్రయించడం ద్వారా సంపాదించినట్లు అంగీకరించాడని అధికారులు తెలిపారు. ఈ మేరకు లిఖితపూర్వక స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అధికారుల సమక్షంలో అదనపు టికెట్ ప్రింట్ చేసే విధానాన్ని కూడా ప్రత్యక్షంగా చూపించినట్లు వెల్లడించారు.

పోలీసులకు ఫిర్యాదు.. కేసుకు రంగం సిద్ధం..

స్వాధీనం చేసుకున్న రూ.18,600 నగదును శుక్రవారం దేవస్థానం ఖాతాలో ఎంఆర్ నంబర్ 23265 ద్వారా జమ చేశారు. ఆలయ ఆదాయానికి నష్టం కలిగించే విధంగా వ్యవహరించిన ఉద్యోగిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ ఈవో బి.హెచ్.వి.ఎస్.ఎన్. కిషోర్ కుమార్ విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు.



అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు..

ఆలయ విధుల్లో భక్తుల విశ్వాసానికి భంగం కలిగించేలా ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈవో శీనా నాయక్ స్పష్టం చేశారు. ముందస్తు సమాచారం, పక్కా ఆధారాలతో నిఘా ఉంచి అక్రమాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ దృష్టికి తీసుకెళ్లగా, నిబంధనలను ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించినట్లు ఈవో పేర్కొన్నారు.

ఎన్నికల వేళ వైసీపీ విధ్వంసకాండ

- అవినాష్‌రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలి

- ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు.. వర్ల రామయ్య తీవ్ర ఆరోపణలు

అమరావతి(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో వైసీపీ నేతలు హింసాత్మక రాజకీయాలకు తెరలేపుతున్నారని తెలుగుదేశం పార్టీ తీవ్రస్థాయిలో ఆరోపించింది. ఓటమి భయంతో నామినేషన్ల ప్రక్రియను అడ్డుకోవడం, ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడింది. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పోలీసుల హౌస్ అరెస్ట్ నోటీసులను ధిక్కరించి 35 కార్ల కాన్వాయ్‌తో బయటకు రావడం వెనుక ముందస్తు ప్రణాళిక ఉందని ఆరోపించింది. ఎన్నికలు ముగిసే వరకు ఆయనను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేసింది.ఈ మేరకు టీడీపీ ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఏ. మల్లికార్జున, ఐజీ రాజకుమారిని కలిసి ఫిర్యాదు చేసింది. మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ఎస్. రాజశేఖర్, ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌లను అధికారులకు అందజేశారు.

సింహాద్రిపురంలో ముందస్తు కుట్ర..

సింహాద్రిపురం, అంకాలమ్మగూడూరు నామినేషన్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలకు వైసీపీ నేతలు కారణమయ్యారని టీడీపీ ఆరోపించింది. 144 సెక్షన్ అమలులో ఉండగా, హౌస్ అరెస్ట్ నోటీసులు తీసుకున్న ఎంపీ అవినాష్‌రెడ్డి వాటిని ఉల్లంఘించి భారీ కాన్వాయ్‌తో బయటకు వచ్చారని పేర్కొంది. దుష్యంత్‌రెడ్డితో కలిసి టీడీపీ శ్రేణులపై దాడులకు ముందస్తు ప్రణాళిక రచించారని ఆరోపించింది. తొండూరు మండలం ఆగూడూరులో జరిగిన దాడిలో సింహాద్రిపురం మార్కెట్ యార్డు చైర్మన్ బండి రామాసురరెడ్డి, తులసీనాథ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారని ఫిర్యాదులో వివరించింది.ఈ అంశాలపై న్యాయ నిపుణులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించిందని వర్ల రామయ్య పేర్కొన్నారు.



ఖాకీ ముసుగులో అవినీతి దందా.?



లంచం ఇస్తే ఎలాంటి అక్రమమైనా ఓకేనా.?

- ఒక్కో అక్రమానికి ఒక్కో రేటు.. ఎవరు ప్రశ్నిస్తే అక్రమ కేసుల వేటు
- చట్టాన్ని కాపాడాల్సిన చేతులే అవినీతి ఆరోపణల్లో కూరుకుపోతున్నాయా.?
- ఏసీబీకి చిక్కితేనే అవినీతి బాగోతం వెలుగులోకి.. లేకుంటే అంతా న్యాయమేనా.?
- కల్తీ పన్నీర్ మాఫియాపై చర్యలేవి.? అక్రమాలను వెలుగులోకి తెచ్చిన విలేకరులపైనే కేసులా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలో కొంతమంది అధికారుల వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని కట్టడి చేయాల్సిన ఖాకీ శాఖలోనే కొందరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడే వారికి అండగా నిలుస్తూ, ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేస్తున్నారన్న ఆరోపణలు పోలీసు శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. ఖాకీ యూనిఫాం అధికారానికి గుర్తా.? ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతకు ప్రతీకా.? అనే ప్రశ్నలు ఇప్పుడు సామాన్య ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ఒక్కో అక్రమానికి ఒక్కో రేటు..

పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగే కొన్ని అక్రమ కార్యకలాపాలకు తెరవెనుక లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. లంచాలు అందితే బంధాలు, నిబంధనలు, చట్టాలు అన్నీ పక్కనపెడతారా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులతో ఆర్థికంగా, సన్నిహితంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో వ్యవహారానికి ఒక్కో రేటు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ, వాటిపై సమగ్ర విచారణ జరగకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది.

ఏసీబీకి చిక్కితేనే అవినీతి బయటపడాలా.?

అవినీతి నిరోధక శాఖకు అధికారులు పట్టుబడినప్పుడే లంచాల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయా.? అంతకుముందు జరుగుతున్న వ్యవహారాలపై నిఘా ఎక్కడ.? ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అంతర్గత విచారణలు ఎందుకు వేగవంతం కావడం లేదు.? అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు మౌనం వహిస్తే కింది స్థాయి సిబ్బందికి ఎవరు భయపడతారు.? స్పెషల్ బ్రాంచ్ పూర్తిగా విఫలమయ్యిందా.? అన్న ప్రశ్నలు ప్రజల నుండి ఉత్పన్నమవుతున్నాయి.

స్పెషల్ బ్రాంచ్‌తో సఖ్యత.. శాంతిభద్రతలకు ముప్పు?

కొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది స్పెషల్ బ్రాంచ్ విభాగంలోని వ్యక్తులతో కలిసి వ్యవహరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్పెషల్ బ్రాంచ్, ఏసీబీ, ల్యాండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఇంటలిజెన్స్ విభాగాలలో విధులు నిర్వహించే అధికారులు అంతర్గత బదిలీలు అన్ని శాఖలలో తిరగడంతో అధికారుల మధ్య స్నేహభావం ఉండడంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయకుండా ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వడం లేదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విధి నిర్వహణలో ప్రజల సేవ, పారదర్శకత కంటే వ్యక్తిగత పరిచయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎవరు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా తమకు లాభం చేకూరితే చాలు అన్న ధోరణి ఉంటే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుంది.? ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

కల్తీ పన్నీర్ మాఫియాపై చర్యలేవి.? విలేకరులపైనే కేసులా.?

తెలంగాణ రాష్ట్రంలోకల్తీ పన్నీర్ తయారీ, సరఫరా వ్యవహారాలను వెలుగులోకి తెచ్చిన విలేకరులపైనే కేసులు నమోదైన ఘటన పోలీసు శాఖ తీరుపై తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ ఆహార పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, అక్రమాలను వెలుగులోకి తెచ్చిన రిపోర్టర్లపైనే కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం.? ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ పన్నీర్ సరఫరాదారులపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదంటేనే అర్థం చేసుకోవచ్చు పోలీసులు మాఫియాలకు ఎంత స్థాయిలో సహకారం అందిస్తున్నారో అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఈ వ్యవహారాన్ని బయటపెట్టిన విలేకరులపై కేసుల నమోదు చర్చనీయాంశంగా మారింది. ప్రజల ఆరోగ్యం కోసం కల్తీలపై పోరాటం చేస్తున్న రిపోర్టర్లని పోలీసులు టార్గెట్ చేయడం వెనుక కల్తీ ఆహార మాఫియా నుండి కొంతమంది పోలీసులకు భారీ స్థాయిలో నజరానా ఉందా.? అన్న ఆరోపణలు ఉన్నాయి. అసలు కల్తీ పన్నీర్ సరఫరాదారుల పాత్రపై విచారణ ఎక్కడ ఆగింది.? వారిని విచారించారా.? బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదు.? అనే ప్రశ్నలకు ఉన్నత అధికారం నుండి సమాధానాలు రావాల్సి ఉంది.

ప్రశ్నిస్తే కేసులు.. అక్రమాలకు పాల్పడితే అండనా.?

పోలీసు శాఖలో జరుగుతున్న అవకతవకలను ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధంగా మారుతున్నాయి. తప్పు చేసిన వారిని ప్రశ్నించడం నేరమా.? ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం నేరమా.? అవినీతి ఆరోపణలను బయటపెట్టే జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేస్తే సమాజానికి న్యాయం ఎలా జరుగుతుంది.? లంచాలు ఇచ్చి అక్రమాలకు పాల్పడేవారికి రక్షణ కల్పిస్తూ, ప్రశ్నించే గొంతులను పోలీసు అధికారులు అణిచివేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే అది పోలీసు వ్యవస్థకే మాయని మచ్చను తెచ్చి పెడుతోంది.

ఉన్నతాధికారులారా.. ఖాకీ గౌరవాన్ని కాపాడండి..

పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ అవినీతిపరులని చెప్పడం సరికాదు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న వేలాది మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. అయితే కొందరి వ్యవహారశైలి కారణంగా మొత్తం శాఖ ప్రతిష్ఠ మసకబారుతోంది. బాధ్యతారాహిత్యం, అవినీతి, నిర్లక్ష్యం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై నిష్పక్షపాత విచారణ జరిపించాలి. కల్తీ పన్నీర్ సరఫరాదారుల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విలేకరులపై నమోదైన కేసుల చట్టబద్ధతను సమీక్షించాలి. అవినీతి ఆరోపణలకు సంబంధించిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి. ఖాకీ అంటే అక్రమార్కులకు భయం కలగాలి, బాధితులకు భరోసా కల్పించాలి. అక్రమాలు చేసే వాళ్ళు లంచం ఇచ్చేవాడికి రక్షణ కల్పించడం కాదు. చట్టాన్ని ఉల్లంఘించినవాడికి శిక్ష పడాలి. ప్రశ్నించే గొంతును అణిచివేయడం కాదు. ప్రజలకు జవాబుదారీతనం చూపించాలి. లేదంటే ప్రజలను కాపాడాల్సిన పోలీసు శాఖపైనే ప్రజలు పూర్తి నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని ఉన్నత అధికారులు ప్రభుత్వం గుర్తించి వెంటనే ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్ ట్యాక్సీల నిషేధానికి సుప్రీం నో


- నిషేధం కన్నా నియంత్రణే మేలని వ్యాఖ్య



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కర్ణాటకలో బైక్ ట్యాక్సీలపై నిషేధాన్ని సమర్థిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. నిషేధించడం కంటే నియంత్రించడమే సరైన మార్గమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బైక్ ట్యాక్సీలపై నిషేధాన్ని రద్దు చేస్తూ గతంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషన్‌ను తోసిపుచ్చిన అనంతరం జస్టిస్ సతీష్ చంద్ర శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. "జీపీఎస్ సౌకర్యం ఉండటం వల్ల యువతులకు బైక్ ట్యాక్సీలు మరింత సురక్షితం. వీటిని పూర్తిగా నిషేధించే బదులు నిబంధనలతో నియంత్రించడం మేలు. ఇప్పటికే దేశంలోని 25 రాష్ట్రాల్లో ఇవి నడుస్తున్నాయి. మా ఆఫీసులోని యువతులను ఎలా ప్రయాణిస్తున్నారని అడిగితే బైక్ ట్యాక్సీల్లోనే వస్తున్నామని చెప్పారు. ఆటోలతో పోలిస్తే ఇది ఐదు రెట్లు చవక అని వారు తెలిపారు" అని జస్టిస్ శర్మ వ్యాఖ్యానించారు. గతంలో ఓలా, ఉబెర్, రాపిడో వంటి అగ్రిగేటర్లు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన కర్ణాటక హైకోర్టు డివిజన్ బెంచ్, వాహనాలను ట్రాన్స్‌పోర్ట్ కేటగిరీ కింద రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని, నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ క్యారేజీలుగా అనుమతులు పరిశీలించాలని స్పష్టం చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా చుక్కెదురైంది.

తుపానుల విధ్వంసం

- కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల ధాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన పంటలకు ఏకంగా రూ.1,092 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీల్లో వరుసగా విరుచుకుపడిన రెండు తుఫాన్ల వల్ల రాష్ట్రంలోని 18 జిల్లాల్లో తీవ్ర విధ్వంసం జరిగిందని చంద్రబాబు వివరించారు. మొత్తం 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ముఖ్యంగా అర్నబ్ తుఫాను ప్రభావంతో 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలో తోటలు నాశనమయ్యాయని, ఇందులో ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో నేలమట్టమైందని తెలిపారు. అలాగే మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని వెల్లడించారు.రైతులను ఆదుకునేందుకు కేంద్ర పథకాల ద్వారా తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. తీవ్రంగా నష్టపోయిన అరటి తోటల పునరుద్ధరణ కోసం 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్' స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' కింద ఎండుమిర్చి, కూరగాయల పంటల రైతులకు అండగా నిలవాలని కోరారు. కోనసీమ, కాకినాడ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు 'కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు' ద్వారా ఆర్థిక సహకారం అందించాలని లేఖలో విన్నవించారు. రైతులకు దీర్ఘకాలిక నష్టాలను తగ్గించేందుకు ఈ సాయాన్ని త్వరితగతిన విడుదల చేయాలని చంద్రబాబు కోరారు.

తిరస్కరించిన ఫైలుకే మళ్లి అనుమతుల ముద్ర

- మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్‌లో అంతా తెరవెనుక వ్యవహారాలేనా.?
- గతంలో షార్ట్‌ఫాల్ నోటీసులు.. ఇప్పుడు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- అనుమతులకు ముందే అంతస్తులు వెలిశాయా.?
- ఏసీపీ బాలశ్రీనివాస్ వ్యవహారశైలిపై కాలనీవాసుల అనుమానాలు
- క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే ఫైలు క్లియరెన్సా.?



OFFICE OF THE MALKAJGIRI MUNICIPAL CORPORATION
BuildNow
SHORTFALL LETTER

To,

Sri ARRAVELLI MAHENDER GOUD	Notice No: 046811/MMC/01178/IABP/CS/2026
S/o SRLA. SIDDAIAH	Date: 02/04/2026
H.NO. 8-57, VENKATESWARA NAGAR, MALKAJGIRI, MEDCHAL MALKAJGIRI DIST. TELANGANA-500 047, TELANGANA	

Dear Sir/Madam,

Sub: Malkajgiri Municipal Corporation - Proposed Construction of **Individual Residential Building** consisting of **Stilt for Parking + 2 Upper Floor** , to an extent of **198.57 Sq mt**, situated at Plot No: **HOUSE NO.10-238ANDI, OLD NOS. 27-153AND4 AND 8-72AND66 ON PLOT NO. 4,** , locality: **VENKATESHARA NAGAR** , Survey No: **207** , Village **Malkajgiri** , **Malkajgiri Circle 5** , **Malkajgiri Zone** , **Malkajgiri Mandal** , **Medchal - Malkajgiri District** Shortfall Letter for misrepresentation of facts while obtaining the Building Permission under Registration/ Instant Approval - Issued - Reg

Ref: 1. Provisional Building permission issued under Instant Registration / Instant approval vide no : **046811/MMC/01178/IABP/CS/2026** dated: **17/03/2026** through the BuildNow application.
2. G.O.Ms.No. 168 MA&UD;, Dt.07-04-2012.
3. G.O.Ms.No.7 MA&UD;, Dt.05-01-2006.
4. G.O.Ms.No. 200 GHMC, Dt.16-11-2020.
5. TGbPASS Act (Act 12 of 2020),Dt. 19-11-2020.
6. MA & UD Memo. No. 8782/plg.III/2022, Dated 26.07.2022

The Provisional permission obtained for construction of individual Residential Building vide reference 1st cited, has been examined in detail by the Post Verification team as per the rules and regulations in force. It is noticed that it has been obtained by suppressing the material facts and by misrepresentation of documents facts as stated below:

Shortfall Remarks: Line Department Triggering Checklist

1. Inspected the site and verified the document it is observed that the applicant has not submitted link document & submitted mortgage deed and also re-verify undertaking. Hence, the submitted proposals may be suggested for shortfall.

మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) సామాన్యుడు ఇంటి నిర్మాణం చేపడితే అడుగడుగునా నిబంధనల పేరుతో అడ్డంకులు సృష్టించే టౌన్ ప్లానింగ్ అధికారులు, లంచాలు ఇచ్చేవారు, పలుకుబడి ఉన్నవారి విషయంలో మాత్రం అదే నిబంధనలను పక్కన పెడుతున్నారా.? మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ విభాగంలో తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసి, షార్ట్‌ఫాల్ నోటీసులు జారీ చేసిన దరఖాస్తుకే ఇప్పుడు అనుమతులు మంజూరు కావడం వెనుక అసలు కథ ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

తిరస్కరణ నుంచి అనుమతి వరకు.. మధ్యలో ఏమి జరిగింది.?

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీ, ఇంటి నంబర్ 10-236/1 భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం వివాదంలో చిక్కుకుంది. సరైన పత్రాలు లేవని, నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు లేవని గతంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ బాలశ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ షార్ట్‌ఫాల్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తం చేసిన అధికారులు ఇప్పుడు అదే స్థలానికి స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరు చేశారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

ముందే నిర్మాణం.. తర్వాత అనుమతుల ఆమోదమా.?

స్థానికుల ఆరోపణల ప్రకారం ఎసిపి బాల శ్రీనివాస్ అవినీతి ఒక్కొకటిగా బయటపడుతుందని సదరు భవనంలో అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు చేపట్టి ఇప్పటికే మూడు అంతస్తుల వరకు నిర్మాణం కొనసాగించారు. నిర్మాణ స్థితిపై స్పష్టత లేకుండానే అనుమతులు మంజూరు చేశారా.? గతంలో నిబంధనలకు విరుద్ధమని గుర్తించిన అంశాలు ఇప్పుడు ఎలా సరిదిద్దబడ్డాయి.? క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా.? లేక కేవలం కాగితాలపైనే పరిశీలన పూర్తి చేశారా.? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

పైరవీ చేస్తే నిబంధనలే మారిపోతాయా.?

సాధారణ ప్రజలు భవన అనుమతుల కోసం కార్యాలయాల



చుట్టూ తిరుగుతున్నా చిన్నచిన్న అభ్యంతరాలతో ఫైళ్లు నిలిచిపోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో ఈ భవనం విషయంలో అనుమతుల ప్రక్రియ ఎలా ముందుకు సాగిందన్నది చర్చకు దారితీసింది. మధ్యవర్తుల జోక్యం, ఆర్థిక లావాదేవీల కారణంగానే ఫైలు వేగంగా కదిలిందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో అనుమతుల వెనుక ఏమైనా అక్రమాలు జరిగాయా.? అన్నది ఏసీబీ, విజిలెన్స్ అధికారుల విచారణలోనే తేలాల్సి ఉంది.



ఓపెన్ ప్లాట్ పేరుతో అసలు వాస్తవాలు దాచారా.?

దరఖాస్తులో స్థలాన్ని ఖాళీ స్థలంగా చూపించారా.? వాస్తవంగా నిర్మాణం ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించారా.? గతంలో అభ్యంతరాలకు కారణమైన సెట్‌బ్యాక్‌లు ప్రస్తుతం ఎలా పరిగణనలోకి తీసుకున్నారు.? అనుమతులు జారీ చేసే ముందు భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారా.? లేదా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. దరఖాస్తులో పేర్కొన్న వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు సరిపోలుతున్నాయో లేదో ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

అధికారుల ఫైళ్లకు విచారణ ఉండదా.?

గతంలో తిరస్కరించిన దరఖాస్తుకు ఇప్పుడు అనుమతులు మంజూరు కావడంపై జీహెచ్ఎంసీ మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్, కమిషనర్, సీసీపీ ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. అనుమతుల ఫైల్లో సమర్పించిన పత్రాలు, గతంలో జారీ చేసిన షార్ట్‌ఫాల్ నోటీసులు, ప్రస్తుత నిర్మాణ స్థితి, సెట్‌బ్యాక్‌ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు సామాన్యులకేనా.? పలుకుబడి ఉన్నవారికి ప్రత్యేక మార్గాలున్నాయా.? అనుమతుల మంజూరులో ఎలాంటి అక్రమాలు జరగలేదని డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఆధారాలతో నిరూపించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే అంతిమయాత్రలో పాడె మోసిన సీఎం విజయ్

- పార్టీ సహచరుడికి భుజం ఇచ్చిన ముఖ్యమంత్రి
- భావోద్వేగానికి గురైన నేతలు, కార్యకర్తలు



(ప్రశ్న న్యూస్ -- డెస్క్) తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తన పార్టీ ఎమ్మెల్యే వి.ఎస్. బాబు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. సహచర ఎమ్మెల్యే మృతితో విషాదంలో ఉన్న ఆయన, అంతిమయాత్రలో స్వయంగా పార్థివదేహాన్ని భుజాన మోసి అందరినీ భావోద్వేగానికి గురిచేశారు.చెన్నైలోని పెరంబూర్‌లో ఉన్న వి.ఎస్. బాబు నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమైన సమయంలో సీఎం విజయ్ మరో ముగ్గురితో కలిసి ఎమ్మెల్యే పార్థివదేహాన్ని భుజాన మోశారు. అనంతరం అంత్యక్రియల వాహనం వెంట నడుస్తూ చివరి వరకు నివాళులర్పించారు. తిరు.వి.కె. నగర్‌లోని విద్యుత్ దహనవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.వి.ఎస్. బాబు గురువారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. అనారోగ్యంతో కొంతకాలంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మరణవార్త టీవీకే శ్రేణుల్లో విషాదాన్ని నింపింది.గురువారం కూడా విజయ్ బాబు నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. శుక్రవారం జరిగిన అంత్యక్రియల్లో మంత్రులు, టీవీకే ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో పాటు ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తదితరులు పాల్గొన్నారు.2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కొలత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన వి.ఎస్. బాబు, అప్పటి ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్‌పై విజయం సాధించడం అప్పట్లో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588